01ATP04.qxd:01ATP04.qxd 05/07/26 10:20 PM Page 1




# అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఆదివారం 05 జూలై 2026 పేజీలు : 04


# పారిశ్రామిక కారిడార్, ఇళ్ల స్థలాల కోసం భూసేకరణ వేగవంతం చేయండి

**-రెవెన్యూ అధికారులతో సమీక్షలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ -ఇళ్ల స్థలాలకు భూసేకరణలో ఎల్‌పీఎస్ పద్ధతి పాటించాలన్న మంత్రి**



రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్

**ఉరవకొండ, జూలై 4 ప్రభాతవార్త**

ఉరవకొండ నియోజకవర్గంలో పారిశ్రామిక కారిడార్ ఏర్పాటుకు అనువైన ప్రాంతాన్ని, ఇళ్ల స్థలాల పంపిణీ కోసం అనువైన భూములను గుర్తించాలని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని పెద్ద కౌకుంట్ల గ్రామంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం మంత్రి తహాశీల్దార్ పి.జి.అరుణ, డిప్యూటీ తహాశీల్దార్ పి.భోగనగౌడ్‌తో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు చిన్నముష్టూరు-పెద్దముష్టూరు, చిన్నముష్టూరు-కోనాపురం, మోపిడి-కోనాపురం, పెన్నహోబిళం ప్రాంతాలను పరిశీలించామని మంత్రికి తెలిపారు. పెన్నహోబిళంవద్ద ఎండోమెంట్ భూమి కాకుండా 400 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని దీనికి సంబంధించి సరిహద్దుల గుర్తింపు పూర్తి అయిందన్నారు. మిగిలిన మూడు ప్రాంతాలు రైతులకు సంబంధించినవికాగా వాటిని కూడా పరిశీలించామని మంత్రికు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటు కోసం అనువైన ప్రాంతాలను ఎంపిక చేయాలన్నారు. ఉరవకొండ పట్టణంలో ఇళ్ల స్థలాల కేటాయింపు నకు సంబంధించి భూసేకరణ విషయంలో అత్యంత జాగ్రత్తలు తీసుకొని భూమి కొనగోలు పద్ధతి కింద మాత్రమే భూములను సేకరించాలన్నారు. ఈ సందర్భంగా ఇళ్ల స్థలాల కోసం చాబాల, హోతూరు, బూదగవి రోడ్లు, తదితర భూములు అనుకూలంగా ఉన్నాయని వాటి మ్యాప్‌లను అధికారులు మంత్రికు చూపించగా పరిశీలించారు. గతంలో భూసేకరణలో జరిగిన స్కామ్‌లను దృష్టిలో ఉంచుకొని ఈ సారి భూసేకరణలో అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నేరుగా భూసేకరణ చేసి రైతులకు డబ్బులు చెల్లించే పద్ధతి కాకుండా కేవలం భూమి కొనగోలు పద్ధతి (ల్యాండ్ పర్చేస్ స్కీమ్) కింద మాత్రమే భూములను సేకరించాలని మంత్రి పయ్యావుల కేశవ్ అధికారులను ఆదేశించారు.

# విద్యార్థులు లక్ష్య సాధనపై స్పష్టత కలిగి ఉండాలి

**- స్వామి వివేకానంద డిస్ట్రిక్ట్ స్టడీ సర్కిల్ ప్రారంభోత్సవంలో**
**- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్... ఎస్పీ సతీష్ కుమార్... ఎమ్మెల్యే కందికుంట...**



స్టడీ సర్కిల్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే



పూజా కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే

**కదిరి, జూలై 4 ప్రభాతవార్త**

పట్టణంలోని ఎస్.టి.ఎస్.ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన వివేకానంద యూత్ డిస్ట్రిక్ట్ స్టడీ సర్కిల్‌ను జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ మరియు కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ శనివారం లాంఛనంగా ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగ యువత భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు ఒక అద్భుతమైన వేదికగా స్వామి వివేకానంద డిస్ట్రిక్ట్ స్టడీ సర్కిల్‌ను ప్రారంభించడం చాలా సంతోషించదగ్గ విషయమన్నారు. కదిరి నరసింహస్వామి వారి ఆశీస్సులతో ఈరోజు ఈ మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఈ కార్యక్రమం పట్ల ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ఎంతో సానుకూలంగా స్పందించి, ఎటువంటి సంకోచం లేకుండా తక్షణమే కార్యరూపం దాల్చడానికి సహకరించినందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు.యువతకు ఐఏఎస్ కంటే ఐపీఎస్ అధికారులన్నా, పోలీస్ డ్రెస్ అన్నా ఒక రకమైన ఫైర్, మోటివేషన్ ఉంటాయి. అందుకే అభ్యర్థుల్లో మరింత ఉత్సాహం నింపేందుకు మన ఎస్పీ ని కూడా ఈ కార్యక్రమానికి ఆహ్వానించడం జరిగింది.ఈ స్టడీ సర్కిల్ ఏర్పాటు కోసం మొదటి నుండి సమన్వయం చేసిన డిస్ట్రిక్ట్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ హరి, అలాగే పనులను మరింత వేగవంతం చేసిన డిస్ట్రిక్ట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రాజేంద్రలతో కూడిన స్టడీ సర్కిల్ బృందానికి ప్రత్యేక అభినందనలు.ప్రస్తుతం సమాజంలో యువతను చదువుకు దూరం చేసే ఎక్స్టర్నల్ ఫోర్సెస్ (మిత్రులు, చాటింగ్, టీవీ, సినిమాలు, మొబైల్ ఫోన్లు) ఎక్కువగా ఉన్నాయి. ఇలాంటి డిస్ట్రాక్షన్స్ వల్ల కెరీర్ మోల్డ్ చేసుకునే సమయాన్ని వృథా చేసుకుంటే భవిష్యత్తులో బాధపడాల్సి వస్తుంది. కాబట్టి సరైన సమయంలో సరైన ప్లాట్‌ఫారమ్‌ను ఉపయోగించుకోవాలన్నారు. అన్ని పోటీ పరీక్షలకు ఉపయోగపడేలా టెన్త్ క్లాస్ నుండి డిగ్రీ పూర్తయిన వారి వరకు నిరంతరం నోటిఫికేషన్లు వస్తూనే ఉంటాయి. అన్ని పోటీ పరీక్షల్లోనూ కామన్‌గా ఉండే జనరల్ నాలెడ్జ్, జనరల్ ఎబిలిటీ, కరెంట్ అఫైర్స్, జనరల్ మ్యాథమెటిక్స్, రీజనింగ్, జనరల్ ఇంగ్లీష్ అంశాలపై ఇక్కడ శిక్షణ ఉంటుంది. గ్రూప్-2 లాంటి పరీక్షల కోసం ఎకానమీ, హిస్టరీ, సివిక్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ వంటి సబ్జెక్ట్ స్పెషలిస్ట్ క్లాసులు కూడా ఉంటాయి. ఈ కోచింగ్ సెంటర్‌లో పూర్తి

మిగతా 4లో...

# అన్నదాతలకు సంకటం...తమ్ముళ్లకు ఆదాయం

**- అడ్డు అదుపు లేని ఇసుక అక్రమదందా**
**- బోరు బావుల్లో అడుగంటుతున్న భూగర్భ జలాలు**
**- తమ్ముళ్లకు ఆదాయం రైతులకు నష్టం**
**- దోచుకో దాచుకో ఇది తమ్ముళ్ల బాగోతం**



కుడ్లూరు వద్ద చిన్న వాగరిలో ట్రాక్టర్‌కు ఇసుక నింపుతున్న కూలీలు



రైతుల పొలాల సమీపంలో చిన్న వాగరిలో పడిన గుంతలు

**డి.హిరెహాళ్ జులై 3 ప్రభాతవార్త**

అధికారం మాది మమ్మల్ని ఎవరూ ఏమీ చేసుకోలేరు మేము ఆడింది ఆట పాడిందే పాట అంటూ కొందర అధికార పార్టీ తెలుగుదేశం కు చెందిన తెలుగు తమ్ముళ్లు బరితెగించి అక్రమ దందాలకు పాల్పడుతున్నారు. ప్రకృతి సిద్ధంగా లభించే సహజ వనరులు, సంపదలను కొల్లగొడుతూ దోచుకున్నోడికి దోచుకున్నంత అన్న చందంగా వ్యవహరిస్తూ అన్నదాతల భవితను ప్రశ్నార్థకంగా మారుస్తున్నారు. అధికార పార్టీకి చెందిన కొందరు బరితెగించి తవ్వుకో, దోచుకో, దాచుకో అంటూ కంచె చేను మేసిన చందంగా బరితెగించి దందాలకు తరలించారు. ఈ వ్యవహారం డి.హిరెహాళ్ మండల పరిధిలోని కూడ్లూరు, బాదరహాళ్, కాదలూరు గ్రామాల పరిధిలో ప్రవహించే చిన్నహగరి లో నిబంధనలకు విరుద్ధంగా ట్రాక్టర్లతో అక్రమంగా ఇసుక తరలించి రైతుల పొట్ట కొడుతున్నారు. మండల పరిధిలోని పాతహడగలి, సోమలాపురం, పులకుర్తి, మడేనహళ్లి తదితర గ్రామాల పరిధిలోని వంకలు, వాగులు సైతం వదలకుండ ఇసుక తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. చిన్న హగరి పరివాహక ప్రాంతం, వంకలు, వాగులు పరిధిలో ఇసుక తోడి తరలిస్తుండడంతో రైతుల పొలాల్లోని బోరుబావుల్లో భూగర్భ జలాల అడుగంటుతున్నాయని బాధిత రైతులు వాపోతున్నారు. మండల పరిధిలోని కూడ్లూరు చిన్న హగరి సమీపంలో రైతులు అశోక్, పెన్నయ్య, ఏరిస్వామి మరికొందరు రైతుల పొలాల సమీపంలో అక్రమార్కులు లోతైన గుంతలు తవ్వి అక్రమంగా ఇసుక తరలిస్తుండడంతో పొలాల్లో పంటలకు ఏర్పాటుచేసిన పైపులైన్లు పాడై, బోరు బావుల్లో భూగర్భ జలాలు అడుగంటుతున్నట్లు బాధిత రైతులు లబోదిబోమంటున్నారు. డి.హిరెహాళ్ మండలం కర్ణాటక సరిహద్దున ఉన్నందున అక్రమార్కులు తమ దందాలకు రాచమార్గంగా మార్చుకొని ఆంధ్ర ప్రకృతి సంపదను కర్ణాటకకు తరలించి జోబులు నింపుకుంటున్నారు. అధికార పార్టీ గ్రామస్థాయి, మండల స్థాయి నాయకులు ఇసుక, మట్టి కర్ణాటక బళ్లారి జిల్లా, చిత్రదుర్గ జిల్లాలకు తరలించి అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటూ ఆంధ్ర ప్రాంతంలోని వంకలు, వాగులు, నది లోని ఇసుకతో పాటు లింగమనహళ్లి, మడేనహళ్లి, మలపనగుడి, హెచ్ ఎస్ తాండా, డి. హిరెహాళ్, ఓబులాపురం గ్రామాల పరిధిలోని మట్టి దిబ్బలు, మట్టి కొండల్లో అక్రమతవ్వకాలు జరిపి కర్ణాటక బళ్లారి జిల్లా పరిధిలోని పరిశ్రమలకు తరలించి దండుకుంటున్నారు. ఇసుకను ట్రాక్టర్ల తో అక్రమంగ కర్ణాటక ప్రాంతంకు తరలించి ఒక్కో ట్రాక్టర్ రూ. 2500 నుండి రూ. 3000లకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్న సంబంధిత రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వైకాపా మండల కన్వీనర్ తో పాటు పలువురు వైకాపా నాయకులు అక్రమ ఇసుక, మట్టి తరలింపు విషయమై పోలీసుల దృష్టికి తీసుకువెళ్లిన ప్రయోజనం లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.. ఎస్.ఐ.** ఇసుక, మట్టి అక్రమ రవాణా తరలింపుపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్.ఐ. గురుప్రసాద్ రెడ్డి తెలిపారు. ఆయా గ్రామాల పరిధిలోని చిన్నహగరి, వంకలు, వాగుల్లో ఇసుకను అక్రమంగ తరలించేందుకు ట్రాక్టర్లు వచ్చిన వెంటనే స్థానిక ప్రజలు, యువకులు, రైతులు తమ దృష్టికి తీసుకురావాలని ఎస్ఐ తెలిపారు.

# రాయలసీమ ఇక కరవు ప్రాంతం కాదు.. ఇండస్ట్రియల్ హబ్

**- రాయలసీమ ఉక్కు పరిశ్రమ ప్రారంభంపై పరిటాల సునీత హర్షం.. - గంగంపల్లి గ్రామస్థులకు ఇళ్ల పట్టాల పంపిణీ..**
**- ఆర్డీటీ సహకారంతో ఇళ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే సునీత చొరవ.. - మూడోవంతు పరిశ్రమలు సీమకే వస్తున్నాయన్న ఎమ్మెల్యే సునీత..**



ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

**రామగిరి, జులై 4 ప్రభాతవార్త**

రాయలసీమ అన్నది ఇక కరవు ప్రాంతం కాదని.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో పారిశ్రామిక హబ్‌గా మారుతోందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రామగిరి మండలం నసనకోట, పంచాయతీలోని గంగంపల్లి గ్రామస్థులకు ఆమె ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. వెంకటాపురంలోని క్యాంప్ కార్యాలయంలో గంగంపల్లి గ్రామస్థులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు. మొత్తం 40మంది బిసి, మైనారిటీ కుటుంబాల వారికి ఒక్కొక్కరికి 3సెంట్ల ప్రకారం ఇంటి స్థలాల పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ.. గత టీడీపీ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలన్న ఉద్దేశ్యంతో చాలా చోట్ల స్థలాల సేకరణ జరిగిందన్నారు. ప్రస్తుతం గంగంపల్లి గ్రామంలో 40కుటుంబాల వారికి పట్టాలు ఇచ్చామన్నారు. అలాగే సుమారు 4లక్షల రూపాయల వ్యయంతో ఆర్డిటి సంస్థ వారు నూతన గృహాలను నిర్మించేందుకు ముందుకొచ్చారన్నారు. వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

**రాయలసీమ రూపురేఖలు మారుతున్నాయి :**

అత్యంత వెనుకబడిన రాయలసీమ రూపురేఖలు మార్చే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లెలో రూ.16,350 కోట్లతో నిర్మించనున్న రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులు ప్రారంభించడంపై ఆమె తన ఆనందాన్ని పంచుకున్నారు. రాష్ట్రానికి వచ్చే పరిశ్రమల్లో మూడోవంతు రాయలసీమ ప్రాంతాలకే తరలి వస్తున్నాయంటే సీమపై ముఖ్యమంత్రికి ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోందన్నారు. రెండేళ్లలో రాయలసీమకు రూ.4.58 లక్షల కోట్ల పెట్టుబడులు 2.76 లక్షల ఉద్యోగాల కల్పనకు శ్రీకారం చుట్టారన్నారు. రాయలసీమ ప్రజల దశాబ్దాల ఆకాంక్ష ఉక్కు పరిశ్రమకు జే.ఎస్.డబ్ల్యూ సంస్థ పూర్తి గ్రీన్ ఎనర్జీతో మొదటి దశలోనే రూ.4500 కోట్ల పెట్టుబడితో నిర్మాణం జరుపుతోందని.. 2028 నాటికి పూర్తై రాయలసీమ యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో ముందుకు వెళ్తుందన్నారు. ఐదేళ్లలో రెండుసార్లు కడప ఉక్కు పరిశ్రమకు శంకుస్థాపన చేసిన జగన్.. కనీసం ప్రహరీ గోడ కూడా నిర్మించకుండా.. నేడు అంతా తన గొప్పేనని చెప్పుకుంటున్నారన్నారు. కేవలం పరిశ్రమలకే కాకుండా వ్యవసాయానికి కూడా తగిన ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. లక్ష కోట్లతో రాయలసీమను గ్లోబల్ హార్టీ కల్చర్ హబ్‌గా మారుస్తున్నారన్నారు. డ్రిప్ ఇరిగేషన్లో రాయలసీమను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దారన్నారు. అలాగే సాగునీటి ప్రాజెక్టులను కూడా వేగవంతం చేశారన్నారు. ఈ ప్రభుత్వం రాయలసీమ అభివృద్ధి కోసం కట్టుబడి ఉందని చెప్పడానికి ఇంతకంటే నిదర్శనం ఏముంటుందని ఎమ్మెల్యే సునీత అన్నారు.

# ప్రతి పంచాయతీకి..రూ.2 కోట్లు

**-వానవోలు గ్రామంలో రూ.1.97 కోట్లతో శ్రీరంగనాథస్వామి దేవాలయం నిర్మాణానికి మంత్రి సవిత భూమి పూజ**
**- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత**
**-పెనుకొండలో రూ.6.45 కోట్లతో దేవాలయాల మరమ్మతులు, నిర్మాణాలు**
**- కూటమి పాలనలో ఎన్నడూ లేనంత అభివృద్ధి, సంక్షేమం**



శిలాఫలకం ప్రారంభిస్తున్న మంత్రి

**గోరంట్ల, జూలై 4 ప్రభాతవార్త**

"వీబీ-జీ రామ్ జీ" పథకం ద్వారా ప్రతి పంచాయతీకి 2 కోట్లు వెచ్చించనున్నామని, ఈ నిధులతో ఆయా పంచాయతీల్లో రోడ్లు, ఇతర మౌలిక సదుపాయలు కల్పించనున్నామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. పెనుకొండ నియోజకవర్గంలో 6.45 కోట్లతో దేవాలయాల మరమ్మతులు, నూతన దేవాలయాల నిర్మాణాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. 8 కోట్ల టీటీడీ నిధులతో పెనుకొండలో కల్యాణమండపం నిర్మాణంతో పాటు నియోజకవర్గంలో 12 భజన మండళ్లు, దేవాలయాలకు మైక్ సెట్లు, ఇతర సౌకర్యాలు కల్పించనున్నామన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గం గోరంట్ల మండలం వానవోలు గ్రామంలో 1.97 కోట్లతో శ్రీరంగనాథస్వామి దేవాలయం నిర్మాణానికి శనివారం మంత్రి సవిత భూమి పూజ చేశారు. అదేవిధంగా గ్రామంలో 70 లక్షలతో పూర్తి చేసిన ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకును ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలో దేవాలయాల మరమ్మతులు, నూతన దేవాలయాల నిర్మాణానికి దేవాదాయ శాఖ, టీటీడీ పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేశాయన్నారు. సీజేఎఫ్ నిధుల ద్వారా 1.97 కోట్లతో శ్రీరంగనాథస్వామి దేవాలయం నిర్మిస్తున్నామన్నారు. పెనుకొండ నియోజకవర్గంలో 6.45 కోట్లతో పలు దేవాలయాలకు మరమ్మతులు చేయడంతో పాటు నూతన దేవాలయాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. టీటీడీ 8 కోట్లు కేటాయించిందని, ఈ నిధుల్లో 5 కోట్లతో పెనుకొండలో కల్యాణమండపం నిర్మిస్తున్నామని తెలిపారు. మరో 3 కోట్లతో 12 భజన మండళ్లు, దేవాలయాలకు మైక్ సెట్లు, ఇతర సౌకర్యాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. నిధులు మంజూరు చేసినందుకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి మంత్రి సవిత ధన్యవాదాలు తెలియజేశారు.

**ప్రతి పంచాయతీకీ రూ.2 కోట్లు :**

జాతీయ ఉపాధి హామీ పథకం స్థానంలో అమలు చేస్తున్న వీబీ-జీ రామ్ జీ పథకం ద్వారా ప్రతి పంచాయతీకి 2 కోట్లను కేటాయిస్తున్నట్లు మంత్రి సవిత తెలిపారు. ఈ నిధులతో ఆయా పంచాయతీల్లో రోడ్లు, ఇతర మౌలిక సదుపాయలు కల్పించనున్నట్లు వెల్లడించారు. నూతన వీబీ-జీ రామ్ జీ పథకం ద్వారా 125 రోజుల పని దినాలు కల్పిస్తున్నామని, రోజుకు 312 రూపాయలను కూలిగా ఇవ్వనున్నామని వెల్లడించారు. ఈ పథకాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**అభివృద్ధిపై చర్చకు రెడీ :**

గతంలో ఎన్నడూ జరగలేనంత అభివృద్ధి, సంక్షేమం రెండేళ్లలో కూటమి ప్రభుత్వ పాలనలో చేపట్టినట్లు మంత్రి సవిత వివరించారు. గోరంట్ల మండలంలోనే సీసీ రోడ్డు, డ్రైనేజీల నిర్మాణానికి 93 లక్షలు, ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణానికి 70 లక్షలు వెచ్చించామన్నారు. 5 కోట్లతో ఓనవోలు - కొలింపల్లి బీటీ రోడ్డును నిర్మిస్తున్నామన్నారు. నెల రోజుల్లో ఓనవోలు - గుంటుపల్లి రోడ్డును పూర్తి చేసి ప్రజలకు

మిగతా 4లో...

# మత్స్యకారుల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

**..జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్**



అధికారులకు సూచనలు ఇస్తున్న జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్

**శ్రీ సత్యసాయి జిల్లా,జూలై 4, ప్రభాతవార్త ప్రతినిధి**

మత్స్యకారుల ఆర్థికాభివృద్ధే ధ్యేయమని జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా కలెక్టర్ మత్స్యశాఖ ప్రగతిపై ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో మత్స్యకారులు, మత్స్య సంపద అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన పలు కీలక చర్యలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మత్స్యకారుల జీవనోపాధిని పెంపొందించేందుకు వివిధ ప్రభుత్వ సంస్థల భాగస్వామ్యంతో జిల్లాలోని చెరువులలోకి పెద్ద ఎత్తున నాణ్యమైన చేప పిల్లలను వదలాలని కలెక్టర్ ఆదేశించారు. చెరువుల్లో చేపల దిగుబడి పెరిగేలా ప్రణాళికలు రూపొందించాలని, అదే సమయంలో రవాణా మరియు నిల్వ తదితర కారణాల వల్ల జరిగే పోస్ట్‌హార్వెస్ట్ నష్టాలను నివారించేందుకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద అర్హులైన మత్స్యకారులకు ఇన్సులేటెడ్ వాహనాలు, బోట్లను త్వరితగతిన అందజేయాలని స్పష్టం చేశారు. మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల రాయితీలను వారు సక్రమంగా గరిష్టంగా ఉపయోగించుకునేలా చూడాలన్నారు. జిల్లాలోని అర్హులైన మత్స్యకారులందరికీ బ్యాంకులతో సమన్వయం చేసుకుని కిసాన్ క్రెడిట్ కార్డులను మంజూరు చేయించాలని, తద్వారా వారికి అవసరమైన పెట్టుబడి సాయం అందేలా చూడాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు.ప్రతి మండలంలోనూ కొత్తగా మత్స్యకార సహకార సంఘాల (సొసైటీల) ఏర్పాటు ప్రక్రియను చేపట్టాలని, ఈ విషయమై ఎస్హెచ్‌జీ మహిళలకు, స్థానిక మత్స్యకారులకు విస్తృత అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా మత్స్యశాఖాధికారి ఎన్. చంద్రశేఖర్ రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య , డ్వామా పీడీ విజయ ప్రసాద్, ఇరిగేషన్ ఎస్ఈ , జిల్లా మత్స్యకార సొసైటీ అధ్యక్షులు నగేష్, అలాగే వివిధ మండలాల అసిస్టెంట్ డైరెక్టర్లు, విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌పై ప్రత్యేక దృష్టి

**- జిల్లా కలెక్టర్ ఆనంద్**



బిఎల్ఓలతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఆనంద్

**శింగనమల, జులై 4 ప్రభాతవార్త**

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలు 82, 84 పరిధిలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీ చేశారు. ఇందులో భాగంగా బిఎల్‌ఓలు ఓటర్లతో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. ఎన్ని ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీచేశారు. ఎన్ని తిరిగి తీసుకున్నారని ఆరాతీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని వేగంగా చేపట్టాలన్నారు. క్షేత్రస్థాయిలో ఉదయం 6 గంటలకు బిఎల్‌ఓలు ఉండాలని, ఎక్కువ పోలింగ్ స్టేషన్ పరిధిలో తక్కువ ఓటర్లు ఉన్నారని, తక్కువ ఓటర్లు ఉన్న పోలింగ్ స్టేషన్‌లు ఉన్న పరిధిలో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ తిరిగి తీసుకోవడాన్ని ఒకటి రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. మరింత ఎక్కువ ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ తిరిగి తీసుకోవడాన్ని చేయాలని రోజుకు 150 వరకు ఎన్యుమరేషన్ ఫారాలు పూర్తి చేయాలన్నారు. సర్ కార్యక్రమంలో ఆదివారం టీచర్లను కేటాయించడం జరిగిందని, సమయం తక్కువగా ఉందని, బిఎల్‌ఓలు బాగా పని చేస్తున్నారన్నారు. వేగంగా సర్‌ను చేపట్టాలని, ఇందు కోసం అగ్రికల్చర్, సిరికల్చర్ తదితర సిబ్బందిని ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సుయాస్‌కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి, తహాశీల్దారు శేషారెడ్డి, బిఎల్‌ఓలు విరుపాక్షిరెడ్డి, తాతయ్య, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 2029 ఎన్నికల్లో పోటీ చేస్తా

**- స్థానిక సంస్థల ఎన్నికల నుంచి రాజకీయం చేస్తాం - అనంతపురం మాజీ ఎమ్మెల్యే డి.గురునాథరెడ్డి వెల్లడి**



మాజీ ఎమ్మెల్యే గురునాథరెడ్డి

**అనంతపురం, జులై 4 ప్రభాతవార్త బ్యూరో**

2029 శాసనసభ ఎన్నికల్లో అనంతపురం నుంచి తాను పోటీ చేస్తానని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల నుంచే రాజకీయం చేస్తామని అనంతపురం మాజీ శాసనసభ్యులు టి.గురునాథరెడ్డి వెల్లడించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ శాసనసభ ఎన్నికల్లోనూ ఏ పార్టీ తరుపున పోటీ చేస్తారు అన్న విలేకర్ల ప్రశ్నకు ఇంకా నిర్ణయించుకోలేదని, మీకు (విలేకర్ల)కు తెలియజేసే ఎన్నికల బరిలోకి దిగుతానని ఆయన వెల్లడించారు. శనివారం అనంతపురంలో తన స్వగృహంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నో హామీలతో ప్రజల ముందుకు వచ్చి అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తోందని, ఇటీవల రాయలసీమలోని జమ్మల మడుగులో జెఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్‌కు ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు చర్యలు తీసుకోవడం అభినందనీయ మన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాన్ ప్రత్యేక చొరవతో వివిధ పరిశ్రమలను తీసుకొస్తున్నారని ఆయన వెల్లడించారు. రాష్ట్ర రాజధాని అమరావతిగా కేంద్ర ప్రభుత్వం కూడా నిర్ణయం తీసుకుందని, రాజ్యాంగ పరంగా గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికే రెండేళ్లు గడిచి పోయిందని మరో రెండేళ్లలో అమరావతిని అన్ని విధాలా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రతిపక్ష హోదాలేని వైసిపి రోజుకొక మాట చెబుతోందని వైసిపి అధికారంలో ఉన్నప్పుడు మూడు రాజధానులు అన్నారని ఆయన గుర్తు చేశారు. ఇప్పుడు వైసిపి మళ్లీ మావిగాన్ అంటూ అమరావతిని వ్యతిరేకించడం సరికాదన్నారు. రాష్ట్ర రాజధానిగా అమరావతిని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు, మళ్లీ రాజధానిని మార్పులు చేర్పులు చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టబద్ధంగా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అదే విధంగా ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడుతున్నాయని, రైతులు ఇబ్బంది పడకుండా కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తుంగభద్ర జలాశయంలో ఇప్పటికీ నీటి నిల్వలు పెరగడం లేదని తద్వారా అనంతపురం జిల్లాలో తాగునీటితోపాటు సాగు నీటి సమస్యలు ఏర్పడే అవకాశం కనిపిస్తోందన్నారు. ఈ పరిస్థితుల్లో శ్రీశైలం జలాశయం నుంచి కృష్ణ జలాలను హంద్రీనీవా ద్వారా ఎక్కువగా అనంతపురంజిల్లాకు తరలించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ప్రజా నాయకుడు వంగవీటి రంగా



వంగవీటి రంగాకు నివాళులర్పిస్తున్న నాయకులు

**హిందూపురం టౌన్ జూలై 04 ప్రభాతవార్త**

వంగవీటి మోహనరంగా ప్రజా ప్రజా నాయకుడు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని కాపునాడు, బలిజ సంఘం, జనసేన నాయకులు అన్నారు. వంగవీటి మోహనరంగా 79 వ జయంతి సందర్భంగా శనివారం శ్రీకృష్ణదేవరాయల కూడలి వద్ద ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కాపునాడు హిందూపురం నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్సార్ మహేష్, పట్టణ అధ్యక్షుడు బలిజ విశ్వనాథ్, జనసేన అధికార ప్రతినిధి నిమ్మకాయల రాము, తదితరులు మాట్లాడుతూ వంగవీటి మోహన రంగా పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని అంకితం చేశారని, అణగారిన వర్గాలకు ఆయన ఒక గొప్ప స్ఫూర్తిప్రదాత అని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ, సమాజంలో అట్టడుగున ఉన్న వారికి అండగా నిలవడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కాపునాడు నాయకులు, బలిజ సంఘం నాయకులు, వంగవీటి రంగా అభిమానులు పాల్గొన్నారు.

# ప్రణాళికతోనే విద్యార్థులు ప్రతిభావంతులు- సైంటిస్ట్

**డి.హిరెహాళ్ జులై 4 ప్రభాతవార్త**



ప్రతిభపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సైంటిస్ట్ రాజు

ప్రణాళిక బద్ధంగా చదివితేనే విద్యార్థులు ప్రతిభావంతుల వుతారని టాప్ ర్యాంకర్స్ అందరూ ప్రతిభావంతులుకారని ఐఓసిఎల్ రీసెర్చ్ స్కాలర్, సైంటిస్ట్ తలారి రాజు పేర్కొన్నారు. శనివారం డి. హిరేహాళ్ మండలం కళ్యం గ్రామంలోని బాలమేధావి ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ వన్నూరుస్వామి ఆహ్వానం మేరకు సైంటిస్ట్ బాల మేధావి ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలను సందర్శించి ఆ పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ మనం ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే జ్ఞానం ఉంటే సరిపోదని, దానితో పాటు శ్రమ, సరైన ప్రణాళిక, మార్గ నిర్దేశం ఉండాలని అప్పుడే మనమం ఉన్నత శిఖరాలను అధిరోహించడం సాధ్యమవుతుందని ఆయన విద్యార్థులకు పిలుపునిచ్చారు. పరీక్షలలో మొదటి ర్యాంకు సాధించిన వారందరూ ప్రతిభావంతులని, మిగిలినవారు ప్రతిభావంతులుకారని అనుకోవడం పొరపాటని, ప్రతి ఒక్కరిలోనూ ఏదో ఒక సామర్థం ఉంటుందని ఆయన విద్యార్థులకు సూచించారు. ఆ సామర్థ్యాన్ని మనమంఅందరం గుర్తించగలిగితే కచ్చితంగా అందులో మనం బాగా రాణించగలం మనలోని ప్రతిభను గుర్తించే సామర్థం మన గురువులకు, తల్లిదండ్రులకు ఉంటుంది కావున తల్లిదండ్రులు గురువులు చెప్పిన మార్గంలో పయనించినప్పుడే బంగారు బాటులు వేసుకుంటామని ఆయన విద్యార్థులకు తెలిపారు. ఉపాధ్యాయ బృందం అందించే విజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటే విద్యార్థుల జీవితం ఎప్పుడూ ఉజ్వలంగానే ఉంటుందని, ఈ విషయాలను విద్యార్థులు అర్థం చేసుకుని, విద్యను అభ్యసిస్తే సంస్కారవంతమైన విద్యతోపాటు వ్యక్తిత్వం లభిస్తుందని విద్యార్థులు ఆ దిశగా పయనించాలని ఆయన సూచించారు. సాంకేతిక రంగంలో అనేకమైన భాగాలు ఉంటాయని అందులో నేను కెమికల్ ఇంజనీరింగ్ తీసుకొని అందులో ప్రఖ్యాతిగాంచిన ప్రభుత్వ రంగ సంస్థ ఆయన ఐ..ఓ.సి.ఎల్ నందు ప్రథమ ఉద్యోగం సంపాదించి అందులో రీసెర్చ్ మేనేజర్ గా ఎదగడం చాలా ఆనందంగా ఉందని సైంటిస్ట్ విద్యార్థులకు తెలిపారు. మీకందరికీ నేను తెలియజేయునది ఏమంటే ఇంటర్ తర్వాత అనేకమైన అవకాశాలు ఉన్నాయని అయితే వాటిని సోదించి అటువైపు పయనించడంలోనే మన జీవితం ఆధారపడి ఉంటుందన్నారు. విద్యార్థి హైస్కూల్ చదువు ముగిసిన తర్వాత కూడా మీ ఉపాధ్యాయులతో మంచి సంబంధాన్ని కొనసాగించి వాళ్ళ మార్గదర్శక పర్యవేక్షణలో మీరు ముందుకు కొనసాగాలని నేను ఆశిస్తున్నానని ఆయన తన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఆ పాఠశాల కరస్పాండెంట్ మాట్లాడుతూ కర్ణాటక సరిహద్దున ఉన్న మండలం అందులోనూ మారుమూల గ్రామమైన నాగలాపురం నుండి బాసర ట్రిపుల్ ఐటీ, మద్రాస్ ఐఐటి వరకు పయనించాడన్నారు. ఈ సైంటిస్ట్ తన జీవిత ప్రయాణంలో అనేక ఒడిదుడుకులను, కష్టాలను, ఇబ్బందులను ఓర్చుకొని ఈరోజు ఈ స్థాయిలో స్థిరపడ్డాడని ఆయన తెలిపారు. ఈ స్థాయికి ఆయన వెళ్లాడంటే ఆయనలోని అంకితభావం, క్రమశిక్షణ గురువులు, తల్లిదండ్రుల పట్ల ఉన్న గౌరవం, దేశం పట్ల భక్తి ఈ సైంటిస్ట్ ను ఈ స్థానానికి తీసుకువెళ్లాయని ఆయన విద్యార్థులకు సూచించారు. ఈ సైంటిస్ట్ తలచుకుంటే విదేశాలలో మంచి జీతంతో విలాసవంతమైన జీవితాన్ని గడపవచ్చు, కానీ తన తండ్రి కోరిక మనం భారతదేశంలో పుట్టాము మన సేవలు భారతదేశానికే ఉపయోగపడాలి కానీ విదేశాలకు కాదు అనే ఒకే ఒక్క మాటతో ఈరోజు దేశ సేవలో తరిస్తున్నాడన్నారు. అంటే అతనికి దేశం పట్ల ఎంత భక్తి భావం ఉందో అర్థమైతుందని, కావున ఇలాంటి వాళ్ళని మనమందరం ముఖ్యంగా విద్యార్థులు ప్రేరణగా తీసుకొని ముందుకు పయనించాలని కస్పాండెంట్ విద్యార్థులకు హితబోధ చేశారు. ఈకార్యక్రమంలోవిద్యార్థిని,విద్యార్థులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సైటిస్ట్ రాజును సన్మానిస్తున్న పాఠశాల కరస్పాండెంట్ వన్నూరుస్వామి

# కుక్కను తప్పించ బోయి బైక్ అదుపు తప్పి మహిళమృతి

**బ్రమ్మసముద్రం, జులై 4 ప్రభాతవార్త**



మృతురాలి వద్ద రోదిస్తున్న బంధువులు

బ్రహ్మసముద్రం మండలం ఎర్రప్పదొడ్డి గ్రామస్తుడైన గొల్ల జయన్న మరియు అతని భార్య కె లక్ష్మి అలియాస్ లక్ష్మి దేవి తన కోడలు శ్రీజ తో పాటు బైక్ పై ఐదుకళ్ళు గ్రామం నుండి ఎర్రప్పదొడ్డి గ్రామానికి వస్తుండగా నాగిరెడ్డిపల్లి గ్రామ శివారున నల్లకట్టువ వద్ద కుక్క అకస్మాత్తుగా రోడ్డుపై బైకు అడ్డం రాగా ప్రమాదవశాత్తు బైక్ తో పాటు ముళ్ళ చెట్లలోకి వెళ్లగా లక్ష్మీదేవి అక్కడికక్కడే చనిపోగా జయన్నకు మరియు కోడలు శ్రీజకు రక్త గాయాలు అయినందున వెంటనే జయన్నను, శ్రీజను 108 అంబులెన్స్ లో కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించ్నడ జరిగింది బ్రహ్మసమ్ముద్ర యస్ ఐ సాయికుమార్ కేసునమోదు చేసుకొని పియం నిమిత్తం కళ్యాణదుర్గ మార్చురికి బాడిని తరలించ డం జరిగింది.

# సంక్షేమం అభివృద్దే కూటమి లక్ష్యం



సిసి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న రమేష్ రెడ్డి

**హిందూపురం టౌన్ జూలై 04 ప్రభాతవార్త**

సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వం లక్ష్యమని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్ రెడ్డి అన్నారు. హిందూపురం మున్సిపాలిటీ 11వ వార్డులో జరుగుతున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రమేష్ రెడ్డి మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, నేతృత్వంలో భారతదేశంలో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధిలో వేగం పుంజుకుంది అని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇతర దేశాల నుండి పెట్టుబడులు అధికంగా వస్తున్నాయని ఇతర దేశాలన్నీ భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైపు చూస్తోందని తెలిపారు. హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో పట్టణం కూడా మరింత అభివృద్ధి చెందుతోందని అన్నారు. హిందూపురంలో ప్రతి వార్డులను సిసి రోడ్ల నిర్మాణం, ప్రజా అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి జరుగుతుందని అన్నారు. 11వ వార్డులో ప్రతి చోట సిసి రోడ్డు నిర్మించడం జరిగిందని రాబోవు మూడేళ్ల కాలంలో వార్డుతో పాటు పట్టణంలో మరింత అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# బాలాలయం ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

**డి.హిరెహాళ్ జులై 4 ప్రభాతవార్త**



ప్రత్యేకాలంకరణలో బాలాలయం ఆంజనేయస్వామి

బాలాలయం ఆంజనేయస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకు న్నారు. శనివారం డి.హిరెహాళ్ మండలం మురడి గ్రామంలో భక్తులు బాలాలయం ఆంజనేయస్వామి దర్శనార్థమై తరలివచ్చి స్వామివారి చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు రామాంజనేయులు, పవన్ కుమార్ ల ఆధ్వర్యంలో బాలాలయం ఆంజనేయస్వామి విగ్రహంను వేకువ జామునే జలంతో శుభ్రపరచి ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు ముందుగా స్వామివారికి సుప్రభాత సేవతో పూజలు ప్రారంభించి పంచామృతాభిషేకం, ఆకు పూజ, విశేషపుష్పాలంకరణ, స్వామివారికి మహా నివేదన, తదితర ఆర్జిత సేవలు, పూజలతో పాటు కుంకుమార్చన లాంటి ప్రత్యేక పూజలు నిర్వహించి మహా మంగళహారతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం గావించారు. ఆంజనేయస్వామి ని దర్శించుకునేందుకు ఉమ్మడి అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలతో పాటు మండలంకు సరిహద్దున ఉన్న పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలోని పలు ప్రాంతాల నుండి భక్తులు తరలివచ్చి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు.

# పాము కాటుకు గురై మృతి చెందిన మహిళా కూలి

**కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్**

**రాయదుర్గం జూలై 4 ప్రభాతవార్త**




బాధితు కుటుంబంతో మాట్లాడుతున్న బాబు

రాయదుర్గం మండలం మల్లాపురం గ్రామానికి చెందిన మహిళా బోయ చిట్టెమ్మ పాము కాటుకు గురై మృతి చెందడం బాధాకరం. నిరుపేద కుటుంబానికి చెందిన ఈ మహిళ మృతి వారి కుటుంబానికి తీరని లోటు. అని జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ బి వెంకటరమణ అన్నారు. ఈ మేరకు శనివారం మృతి చెందిన మహిళా కుటుంబాన్నిఆయన సందర్శించి భర్త శ్రీనివాసులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ కూలి పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించే ఏకైక ఆధారాన్ని ఆ మహిళ కోల్పోయింది. మృతురాలి కుటుంబం అత్యంత దుర్భర పరిస్థితుల్లో ఉంది. కావున, జిల్లా అధికారులు మరియు జిల్లా పాలనా యంత్రాంగం వెంటనే స్పందించి, బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరంగా తక్షణ ఆర్థిక సహాయం అందజేయాలని కోరారు. మౌలిక వసతులు పాము కాటుకు గురైన ప్రాంతం , అక్కడ సరైన పారిశుధ్యం లేకపోవడం, వీధిదీపాలు సరిగ్గా వెలగకపోవడం వంటి సమస్యలను కలుపు మొక్కలు, ముళ్ల పొదలు తొలగించేలా గ్రామ పంచాయతీ అధికారులను చొరవ చూపాలని అధికారులను సూచించారు. అధికారులకు స్పష్టమైన ఆదేశాలు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గ్రామంలో చేపట్టాల్సిన ముందస్తు జాగ్రత్తలపై స్థానిక అధికారులకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. కమిటీ తరపున నివేదిక క్షేత్రస్థాయిలో జరిగిన ఈ నష్టంపై పూర్తి వివరాలు సేకరించి, జిల్లా కలెక్టర్ గారికి నివేదిక అందజేస్తామని, బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని వారికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ యాక్ట్ అవేర్నెస్ వాలంటరీ ఆర్గనైజేషన్ సభ్యులు అబ్దుల్లా శంకరప్ప కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు

**శెట్టూరు,జూలై 04 ప్రభాతవార్త**



నివాళులు అర్పిస్తున్న అధికారులు ప్రజా ప్రతినిధులు

మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మన్యం వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ టి.జీలానిబాషా, కూటమి నాయకులు కార్యాలయ పరిపాలన అధికారి శ్రీనివాసులుతో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ టి. జీలాని బాషా మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు దేశ స్వాతంత్రం కోసం చేసిన త్యాగాలు, ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం సాగించిన పోరాటం చిరస్మరణీయమని అన్నారు. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని దేశభక్తి, సేవాభావంతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం అనంతరం పాల్గొన్న వారందరూ అల్లూరి సీతారామరాజు సేవలను స్మరించుకుంటూ ఘనంగా నివాళులర్పించారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి...ఎన్నో కుటుంబాలకు అండనిస్తోంది

**- మంత్రి సవితమ్మ చేతుల మీదుగా...నార్సింపల్లి వాసికి ప్రభుత్వ సాయం**



చెక్కును అందజేస్తున్న మంత్రి

**గోరంట్ల, జూలై 4 ప్రభాతవార్త**

గోరంట్ల మండలం నార్సింపల్లి గ్రామానికి చెందిన నాగరాజుకు మంజూరైన 1,10,241 రూపాయల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును గోరంట్ల పార్టీ కార్యాలయంలో లబ్ధిదారునికి రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవితమ్మ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కూటమి ప్రభుత్వం మంజూరు చేసిన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి, హస్తకళల స్టేట్ డైరెక్టర్ సోమశేఖర్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి నరేష్, నిమ్మల శ్రీధర్, సింగిల్ విండో అధ్యక్షులు బెల్లాలచెరువు చంద్ర, రవిమోహన్, ఉమాశంకర్, బిజెపి మండల అధ్యక్షులు లక్ష్మినారాయణ, జిల్లా నాయకులు బొట్టు శ్రీనివాసులు, జనసేన మండల అధ్యక్షులు సంతోష్, జిల్లా కార్యదర్శి సురేష్, మాజీ ఎంపిపి నిమ్మల విద్యాధరణి, ఉత్తమరెడ్డి, నాగేనాయక్, గిరిధర్‌గౌడ్, అజంతుల్లా, బూదిలి లక్ష్మీపతి, వాల్మీకి వెంకటేష్, జయరాం, చింతా రామచంద్రరెడ్డి, నబిరసూల్, ఆగిశం నాగరాజు, రోహిత్, సుభహన్, పసుపులేటి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

# సర్ ప్రత్యేక డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోండి

**-మున్సిపల్ కమిషనర్ ఎం.లక్ష్మీదేవి**

**గుంతకల్లు, జూలై 4 ప్రభాతవార్త**



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ఎం.లక్ష్మీదేవి

రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఆదివారం నిర్వహించే సర్ ప్రత్యేక డ్రైవ్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం.లక్ష్మీదేవి పేర్కొన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డుల్లో ప్రత్యేక ఓటర్ల సవరణ (సర్) కార్యక్రమం జరుగుతోందన్నారు. ఈ ప్రక్రియ ఈనెల 14వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. గడువులోపు బిఎల్ఒలు అందించిన ఈఎఫ్ ఫారాలపై ఓటర్లు తమ వివరాలను పూర్తి చేసి అందించాలన్నారు. ప్రజల సౌకర్యార్థం ఆదివారం కూడా ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తున్నామన్నారు. బిఎల్ఒలు, మున్సిపల్, మెప్మా సిబ్బంది, ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ ఓటు వివరాలు సవరణ చేసుకోవాలన్నారు. అంతేకాకుండా 2002 ఓటర్ల జాబితా తెలుసుకునేందుకు మున్సిపల్ కార్యాలయంలో సహాయక కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేశామని కమిషనర్ తెలియచేశారు.

# గుత్తిలో 40.32 శాతం సర్ ప్రక్రియ పూర్తి

**-అదనంగా 111 మంది సిబ్బంది నియామకం**

**-మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా**

**గుత్తి, జూలై 4 ప్రభాతవార్త**



మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతున్న దృశ్యం

కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్ ప్రక్రియ గుత్తి మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటిదాకా 40.32 శాతం పూర్తి చేశామని మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో 39,198 మంది ఓటర్లు ఉండగా వారిలో 15,805 మంది ఓటర్లను ఓటర్ జాబితాలో అనుసంధానం చేశామన్నారు. వ్యవధి తక్కువగా ఉన్న కారణంగా ప్రతి పోలింగ్ బూత్‌కు అదనంగా ముగ్గురు సిబ్బందిని నియమించామన్నారు. ఈ మేరకు అదనంగా 111 మంది సిబ్బందిని డేటా వెరిఫికేషన్ లక్ష్యం పూర్తి చేసేందుకు ఏర్పాటు చేశామన్నారు. నిర్ణీత వ్యవధిలోగా 100 శాతం లక్ష్యాన్ని సాధిస్తామని కమిషనర్ పేర్కొన్నారు.

# లేపాక్షిలో 6, 7 తేదీల్లో చికెన్, మటన్ షాపులు బంద్



చికెన్, మటన్ షాపుల యజమానులతో సమావేశమైన దృశ్యం

**లేపాక్షి, జూలై 4 ప్రభాతవార్త**

లేపాక్షి వీరభద్రాలయం సందర్శనకు శృంగేరి పీఠాధిపతి శ్రీవిధుశేఖరభారతిస్వామీజీ ఈనెల 7న సాయంత్రం 6 గంటలకు విచ్చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం రాష్ట్ర టూరిజం శాఖ డైరెక్టర్ జయప్ప, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఆనంద్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి సాయికుమార్ లేపాక్షి చికెన్, మటన్ షాపుల నిర్వాహకులతో సచివాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీటీడీసీ డైరెక్టర్ జయప్ప, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఆనంద్‌కుమార్‌లు మాట్లాడుతూ ప్రపంచ పర్యాటక క్షేత్రమైన లేపాక్షి శ్రీవీరభద్రాలయానికి ఈ నెల 7వతేదీన శృంగేరి పీఠాధిపతి శ్రీవిధుశేఖరభారతిస్వామీజీ రానున్నారన్నారు. ఈనెల 6, 7తేదీల్లో చికెన్ మటన్ షాపులను లేపాక్షిలో నిర్వహించరాదని సూచించారు. అందుకు చికెన్, మటన్ షాపుల నిర్వాహకులు సమ్మతించి రెండు రోజులపాటు తమ షాపులను నడపమని తెలిపారు. ఈ కార్యక్రమంలో చికెన్, మటన్ షాపుల యజమానులు పాల్గొన్నారు.

# గుత్తిలో లారీ డ్రైవర్‌పై దాడి

**గుత్తి, జూలై 4 ప్రభాతవార్త**



యువకులు డ్రైవర్‌పై దాడికి పాల్పడిన లారీ

గుత్తి పట్టణంలో శనివారం ఉదయం మద్యం మత్తులో ఉన్న యువకులు తమ కారుకు సైడ్ ఇవ్వలేదనే ఆక్రోశంతో లారీ డ్రైవర్‌పై దాడికి పాల్పడ్డారు. అందిన సమాచారం మేరకు ముద్దనూరుకు చెందిన లారీ నెల్లూరు నుండి సేడమ్‌కు వెళుతోంది. ఈ నేపథ్యంలో కర్ణాటకకు చెందిన కొంతమంది యువకులు ఇన్నోవా కారులో రాయచూర్‌కు వెళుతూ లారీని ఓవర్ టెక్ చేసేందుకు యత్నించారు. సాధ్యం కాకపోవడంతో పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద లారీని అడ్డుకుని బీహార్‌కు చెందిన లారీ డ్రైవర్ సిరియారంజన్‌ను చితకబాదారు. ఆ పై అతని వద్ద ఉన్న సెల్ ఫోన్, లారీ తాళాలను లాక్కున్నారు. కొంతమేర నగదు సైతం అపహరించినట్లు సమాచారం. ఈ సంఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ఎస్సీల భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి

**-రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్**

**-డీఆర్‌డీఏ పీడీ, ఐకేపీ అధికారులతో సమీక్ష**



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్

**ఉరవకొండ, జూలై 4 ప్రభాతవార్త**

ఉరవకొండ నియోజకవర్గంలోని 1,000 మంది ఎస్సీ లబ్దిదారులకు సంబంధించిన గత 25 ఏళ్ళుగా కొనసాగుతున్న భూ సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని పెద్దకౌకుంట్ల గ్రామంలో తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన డీఆర్‌డీఏ పీడీ, ఐకేపీ, అనుబంధ విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ దాదాపు 25 సంవత్సరాల క్రితం అప్పటి ప్రభుత్వ హయాంలో తన నేతృత్వంలో ఐకేపీ, ఎస్సీ కార్పొరేషన్లు సంయుక్తంగా ఉరవకొండ నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 1,000 మంది ఎస్సీ లబ్దిదారులకు భూములను కొనగోలుచేసి పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఆనాడు ఈ భూముల కొనగోలుకు ఐకేపీ నిధులు సమకూర్చగా నిబంధనల మేరకు లబ్దిదారులు ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించాల్సి ఉండగా వెనక్కు కట్టలేదన్నారు. ఇటీవల జరిగిన భూముల రీసర్వేలో సదరు భూములన్నీ 1బి అడంగల్‌లో లబ్దిదారులైన రైతుల పేర్లమీద కాకుండా తిరిగి ఐకేపీ పేరు మీదకు మారిపోవడం జరిగిందన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. లబ్దిదారులకు అన్యాయం జరుగడానికి కారణమైన సాంకేతిక సమస్యను పరిష్కంచాలన్నారు. భూములు తిరిగి ఎస్సీ లబ్దిదారుల పేర్ల మీదకే మార్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి పయ్యావుల కేశవ్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ శైలజ, ఏపీఎంలు, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

# పూరించిన ఎన్యుమరేషన్ ఫారాలు తప్పక బీఎల్‌వోకు అందించాలి

**-ఈఎఫ్‌లు అందించకుంటే డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో పేర్లు నమోదు కావు**

**-ఈఆర్‌వో, కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి.మల్లికార్జునరెడ్డి**

**ఉరవకొండ, జూలై 4 ప్రభాతవార్త**



ఈఆర్‌వో, కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి.మల్లికార్జునరెడ్డి

బీఎల్‌వోల నుండి ఎన్యుమరేషన్ ఫారాలు (ఈఎఫ్) పొందిన ప్రతి ఓటరు వివరాలను అందులో పూరించి ఒక పాస్‌పోర్టు సైజ్ ఫోటోను జతచేసి బీఎల్‌వోకు తిరిగి తప్పనిసరిగా అందజేసి రసీదు పొందాలని ఉరవకొండ-149 అసెంబ్లీ నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి.మల్లికార్జునరెడ్డి సూచిం చారు. శనివారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈఆర్‌వో వి.మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ఎన్యుమరేషన్ ఫారాలు అందించని వారి పేర్లు ఈనెల 21వ తేదీన ప్రచురించే డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో నమోదు కావని ఈ విషయాన్ని ఓటర్లు గమనించాలన్నారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో పేరులేని వారి నుండి ఓటరుగా నమోదుకై దరఖాస్తులు స్వీకరించి విచారణ అనంతరం అర్హులను 22 తేదీన ప్రచురించే తుది ఓటరు జాబితాలో నమోదు చేయబడుతుందన్నారు. ఓటరు వారి ఇంటి నుండే వారి ఎన్యుమరేషన్ ఫారం వివరాలను ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. సర్-2026 కార్యక్రమం బీఎల్‌వోలు పీఎస్‌ల పరిధిలోని బీఎల్‌ఏలతో సమన్వయం చేసుకొని నియోజకవర్గంలోని 2,26,187 మంది ఓటర్లకుగాను ఇప్పటివరకు 2,21,215 మంది ఓటర్లకు (97.80శాతం) ఎన్యుమరేషన్ ఫారాలు జారీ చేయడం జరిగిందన్నారు. ఓటర్ల నుండి తిరిగి 82,137 ఎన్యుమరేషన్ ఫారాలు స్వీకరించి బీఎల్‌వోల యాప్‌లో డిజిటలైజేషన్ చేయడం జరిగిందన్నారు. డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతంకు ఓటర్లు, బీఎల్‌ఏలు సహకరించాలని ఈఆర్‌వో వి.మల్లికార్జునరెడ్డి కోరారు.

# పేదరిక నిర్మలం పై వ్యాస రచన పోటీలు

**బెళుగుప్ప జూలై 4 ప్రభాతవార్త**

బెలుగుప్ప మండల కేంద్రంలో ఉన్నత పాఠశాల విద్యార్థులు వ్యాస రచన పోటీలు సింగిల్ విండో ప్రెసిడెంట్ కంచిరాముడు. అధ్యర్యంలో 21విద్యార్థులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో ceo. పాండురంగ సహకార సభ్యులు. లక్ష్మీబాయి ఈశ్వర్ పాల్గొన్నారు.

# లబ్ధిదారునికి వాహనాన్ని అందజేసిన మాజీ మంత్రి రఘువీరారెడ్డి, బ్యాంక్ మేనేజర్ భరత్

**- వివిధ రకాల రుణాలను సద్వినియోగం చేసుకోవాలి**

**- శాఖా మేనేజర్ పి. భరత్ శ్రవణ్ కుమార్**

**మడకశిర, జులై 4 ప్రభాతవార్త**



వాహనాన్ని అందజేస్తున్న దృశ్యం

మడకశిర నియోజకవర్గ పరిధిలోని నీలకంఠాపురం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ శాఖ ద్వారా స్థానిక కాంట్రాక్టర్ చరణ్ గౌడకు టిప్పర్ వాహనం కొనుగోలు నిమిత్తం రూ.40లక్షలు భారీ రుణాన్ని మంజూరు చేసినట్లు బ్యాంక్ మేనేజర్ పి.భరత్ శ్రవణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం బ్యాంకు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ సీడబ్ల్యూసీ సభ్యులు, మాజీ మంత్రి రఘువీరారెడ్డి చేతుల మీదుగా వాహనాన్ని లబ్ధిదారునికి అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ భరత్ మాట్లాడుతూ.. గ్రామీణ, పట్టణ ప్రాంతాల నిరుద్యోగులు, వ్యాపారస్థులు ఆర్థికంగా స్థిరపడేందుకు ఏపీజీబీ బ్యాంక్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. తమ బ్యాంకు ద్వారా కేవలం వాహన రుణాలే కాకుండా, పౌల్ట్రీ (కోళ్ల షెడ్ల నిర్మాణం), జేసీబీ కొనుగోలు, చిన్న తరహా పరిశ్రమల స్థాపనకు ప్రత్యేక రుణ సదుపాయాలు కల్పిస్తున్నట్లు వివరించారు. మడకశిర ప్రాంత యువత, వర్తకులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ పి.సురేశ్ బాబు, క్రోల్ ఆఫీసర్ టి.రేష్మ, క్యాషియర్ శివ గణేష్, బ్యాంక్ ఖాతాదారులు పాల్గొన్నారు.

## ముగిసిన ఉపాధ్యాయుల జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం




జ్ఞాన జ్యోతి కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

అనంతపురం న్యూటౌన్, జులై 4 ప్రభాతవార్త

అంగన్వాడీ కేంద్రాలలో పునాది విద్యను బలోపేతం చేసేందుకు అంగన్వాడీ టీచర్లకు శిక్షణ ఇచే డిఆర్పిలకు జ్ఞాన జ్యోతి రిఫ్రెషర్ శిక్షణా కార్యక్రమం బుక్కరాయసముద్రంలో కల విజయభారతి డి.ఈడి కాలేజీలో గత రెండు రోజులుగా జరుగుతున్నటువంటి జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ శిక్షణ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయిలో శిక్షణ తీసుకున్న కీ రిసోర్స్ పర్సన్స్ జిల్లా స్థాయి రిసోర్స్ పర్సన్స్‌కు పునాది విద్యలోని వివిధ అంశాలలో శిక్షణ ఇచ్చారు. ఇందులో పిపి-1, పిపి-2 తరగతుల పిల్లలకు బోధనా మెలకువలు, లింగ సమానత్వం, పరిశుభ్రత పోషణ తదితర అంశాల గురించి సంపూర్ణ అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా హాజరైన డిఈఓ శ్రీనివాసరావు పిడిఐసిడిఎస్ షాజిదా బేగం, సమగ్ర శిక్ష అభియాన్ ఎఎంఓ వేణుగోపాల్‌లు మాట్లాడుతూ.. గతంలో అంగన్వాడీ కేంద్రాలు పోషణ అందించే కేంద్రాలుగా ఉండేవని కానీ ప్రభుత్వం ఇప్పుడు అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలకి అందుతమైన సిలబస్ తయారు చేసి 3 సం వయసు నుంచి మంచి బోధన అందించాలని కృతనిశ్చయంతో ఉంది అందులో భాగంగా అంగన్వాడీ టీచర్లకు బోధనలో మంచి శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారని తెలియచేశారు. ఒక్కొక్క మండలం నుంచి ముగ్గురు చొప్పున మొత్తం 93 మంది టీచర్లు ఐసిడిఎస్ తరపున 6 మంది సిడిపిఓలు, 66 మంది సూపర్వైసర్లు, 12 మంది అంగన్వాడీ టీచర్లు శిక్షణ తీసుకున్నారు. తిరిగి వీరి జిల్లాలోని అందరు అంగన్వాడీ టీచర్లకు మండల స్థాయిలో శిక్షణ ఇవ్వబోతున్నట్లు వారు తెలిపారు. కావున మండల స్థాయిలో జరిగే శిక్షణ కార్యక్రమం దిగ్విజయం చెయ్యాలని ఎఎంఓ వేణుగోపాల్ తెలియజేశారు. ఈ శిక్షణా కార్యక్రమంలో అసిస్టెంట్ ఎఎంఓలు ఫణిరాజ్ నారాయణ స్వామి ప్రథమ్ డిస్టిక్ కో ఆర్డినేటర్ లక్ష్మణ మూర్తి పాల్గొన్నారు.

### సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో నెలకొన్న

## సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.వీరేంద్ర ప్రసాద్




నిరసన వ్యక్తం చేస్తున్న పిడిఎస్‌యు విద్యార్థి సంఘం నాయకులు

అనంతపురం న్యూటౌన్, జులై 4 ప్రభాతవార్త

అనంతపురం జిల్లా కలెక్టర్ ఆఫీస్ దగ్గర పిడిఎస్‌యు విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా విద్యారంగంలో సమస్యలను పరిష్కరించాలని పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.వీరేంద్ర ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 50కి పైగా ఎస్సీ హాస్టల్స్ ఉన్నాయి, 50కి పైగా బీసీ హాస్టల్స్ ఉన్నాయి, వేల మంది విద్యార్థులు హాస్టల్‌లో వసతిని ఏర్పాటు చేసుకుని చదువు కుంటా ఉన్నారు. బీటెక్, డిగ్రీ కంప్లీట్ అయినటువంటి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు దీనివల్ల కాలేజ్ యాజమాన్యం ఫీజు విద్యార్థులే కట్టాలని చెప్పి ఒత్తిడి గురి చేస్తా ఉంది. కాబట్టి పెండింగ్లో ఉన్నటువంటి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.7200 కోట్లను వెంటనే విడుదల చేయాలి.. జీవో నెంబర్ 77 రద్దు చేయాలి. 2026-27 అకాడమిక్ ఇయర్ ప్రారంభమై దరిదాపుగా 20 రోజులు కావస్తుంది అయినా ఇంతవరకు విద్యార్థులకు రాధాకృష్ణ కిట్లను సరఫరా సరఫరా చేయలేదు. చైతన్య, నారాయణ, భాష్యం, ఎస్సార్ లాంటి విద్యాసంస్థలు ఫీజులు ఇష్టానుసారంగా కట్టించుకుంటూ తల్లిదండ్రులని ఇబ్బంది పెడతా ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా ఐటిఐ కళాశాల విద్యార్థులకు హాస్టల్ సదుపాయాలు సరిగా లేవు కాలేజ్ అనుబంధం హాస్టల్స్ లేవు ఐటిఐ కళాశాలలో చదివే విద్యార్థులు హాస్టలను బయట తీసుకొని కాలేజీకి వచ్చి పోతున్న పరిస్థితి కాబట్టి జిల్లా వ్యాప్తంగా ఐటిఐ కళాశాల అనుబంధ హాస్టల్‌లను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమంలో పిడిఎస్యు నాయకులు. వంశీ, నాగచైతన్య హారీష్ ధనుష్ ఎన్ గౌతమ్ పాల్గొన్నారు.

## బుక్కరాయసముద్రంలో క్రీడా ఛాంపియన్‌షిఫ్



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ సునీత

బుక్కరాయసముద్రం జూలై 4 ప్రభాతవార్త

మండల కేంద్రమైన బుక్కరాయసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో ఈ నెల 7,8 తేదిల్లో క్రీడా ఛాంపియన్షిప్ నిర్వహిస్తున్న ఎంపీపీ దాసరి సునీత తెలిపారు. శనివారం నిర్వహించిన అనంత క్రీడ ఛాంపియన్షిప్ సమావేశంలో చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ జూలై 7వ తేదిన కబడ్డీ, కోకో, వాలీబాల్, (యు14), 8వతేదిన అథ్లెటిక్స్ నిర్వహి స్తారు. బుక్కరాయసముద్రం మండలంలో ఉన్న ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చును. ఈ సమావేశంలో ఎంపీపీ సునీత తోపాటు ఎంపిడివో సాల్మన్, ఎంఈఓ1 నవిద, ఎంఈఓ 2 లింగానాయక్, ప్రధానో పాధ్యాయురాలు వసుందర, మండల కోఆర్డినేటర్ నాగరాజు, పిడి రాజశేఖర్ రెడ్డి, వెంకటరమణ, వరలక్ష్మి, లలిత, తిప్పేస్వామి పాల్గొన్నారు

## రామాలయ నిర్మాణానికి లక్ష నగదు అందజేసిన మాజీ సర్పంచ్ ఆంజనేయులు యాదవ్.



లక్ష నగదు ను విరాళమును అందజేస్తున్న మాజీ సర్పంచ్ ఆంజనేయులు యాదవ్.

అనంతపురం రూరల్, జులై 04 ప్రభాతవార్త

అనంత రూరల్ మండలం రాచాన పల్లి పంచాయితీ సిండికేట్ నగర్ ఆర్ఎన్ఆర్ కాలనీ లో నూతనంగా నిర్మించిన రామాలయం ప్రారంభం. ఈ నెల 9,10,11వ తేదీలలో జరగనున్న సీతారామ, లక్ష్మణ హనుమంతుని పూజావిగ్రహ ఆవిష్కరణ కోసం రాచానపల్లి పంచాయతీ మాజీ సర్పంచ్ అంజినేయులు యాదవ్ రూ.1 లక్ష నగదు ను కమిటీ సభ్యులకు విరాళంగా శనివారం అందజేశారు.

## ప్లాస్టిక్ రహిత కార్యాలయంగా జడ్పీని తీర్చి దిద్దుదాం

: జడ్పీ చైర్మన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ, జులై 4 ప్రభాతవార్త



బాటిల్ కంటైనర్లు ప్రారంభిస్తున్న జడ్పీ చైర్మన్ బోయ గిరిజమ్మ

ప్లాస్టిక్ రహిత కార్యాలయంగా జిల్లా పరిషత్‌ను తీర్చి దిద్దు దామని జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ సూచించారు. జిల్లా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణకై ఏర్పాటు చేసిన ప్రత్యేక కంటైనర్‌ను శనివారం జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ, జడ్పి సిఇఓ విజయలక్ష్మితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ.. కార్యాలయంలో వినియోగించిన ప్లాస్టిక్ బాటిల్స్, కప్పులు, గ్లాసులను ఎక్కడ పడితే అక్కడ లేకుండా కంటైనర్‌ను ఉపయోగించాలని సూచించారు. అదే విధంగా జడ్పి సమావేశ మందిరంలో నిర్వహించిన స్వాతంత్ర్య సమరయోధులు, మన్యం వీరుడు అల్లూరు సీతారామరాజు 129వ జయంతి వేడుకల్లో జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ, సిఇఓ విజయలక్ష్మితో కలిసి హాజరై అల్లూరు సీతరామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతరామరాజు చేసిన సేవలను ఆమె కొనియాడారు. ఆయా కార్యక్రమంలో డిపిఆర్‌సి కోఆర్డినేటర్ సౌజన్యకుమారి, జడ్పి కార్యాలయ ఏఓలు విజయభాస్కర్‌రెడ్డి, నియాజ్, నందకిషోర్, ముత్యాల రెడ్డితోపాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వైసిపి నాయకుడు సంజీవరాయుడు మృతి పట్ల అనంత సంతాపం

అనంతపురం సిటీ, జులై 4 ప్రభాతవార్త



సంజీవరాయుడు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత

నగరానికి చెందిన వైసిపి నాయకుడు సంపంగి సంజీవ రాయుడు మృతి పట్ల వైసిప ఇజిల్లా అద్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. నగరంలోని నవోదయ కాలనీకి చెందిన సంపంగి సంజీవరాయుడు శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి వారి నివాసానికి వెళ్లి సంజీవరాయుడు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబీకులతోపాటు అతని సోదరుడు, మాజీ కార్పోరేటర్ సంపంగి రామాంజినేయులును ఓదార్చారు. అదే విధంగా వైసిపి సీనియర్ నేత అనంత చంద్రారెడ్డి, మాజీ మేయర్ మహ్మద్ వసీం, వైసిపి ట్రేడ్ యూని యన్ జిల్లా అధ్యక్షులు ఓబిరెడ్డి, సీనియర్ నాయకులు నాగార్జున రెడ్డిలతోపాటు పలువురు నేతలు సంజీవరాయుడు మృతదేహానికి పూమాలలు వేసి నివాలులు అర్పించారు. పార్టీ పటిష్టతకు అతను చేసిన సేవలను ఈ సందర్భంగా వారు గుర్తు చేసుకున్నారు.

## వైసిపి ఎస్టీ సెల్ నేతలపై వివక్ష చూపిన అధికారిపై సస్పెండ్ చేయాలి

- వైసిపి ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ నాయక్




విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ నాయక్

అనంతపురం సిటీ, జులై 4 ప్రభాతవార్త

వైసిపి ఎస్టీ సెల్ నేతలపట్ల వివక్ష చూపిన జిల్లా గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారిని సస్పెండ్ చేయాలని వైసిపి ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ నాయక్ డిమాండ్ చేశారు. జిల్లా వైసిపి కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలకు వైసిపి ఎస్టీ సెల్ నాయకులు అధికారుల ఆహ్వానం మేరకు వెల్లడం జరిగిందన్నారు. అయితే సమావేశంలో అన్ని కుల సంఘాలు, ఇతర పార్టీల నేతలకు మాట్లాడేందుకు అవకాశం కల్పించి, కేవలం వైసిపి ఎస్టీ సెల్ నేతలకు మాత్రం మాట్లాడేందుకు అవకాశం కల్పించ లేదన్నారు. కేవలం గిరిజన సంక్షేమ అధికారి ఉద్దేశ పూర్వకంగా చేసిన పనిగా తాము భావిస్తున్నామని అతడిని బాధ్యుడిని చేసి సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లాలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను సమావేశంలో చెప్పే అవకాశం కూడా ఇవ్వకుండా తమ హక్కులను కాలరాశారని, ఆయన విమర్శించారు. జిల్లా అధికారులు వ్యవహరించిన తీరు గిరిజనులను అవమాన పర్చే విధంగా ఉందని పేర్కొన్నారు. సమావేశంలో గోరంట్ల జడ్పి టిసి పాళె జయరాం నాయక్, నగర ఎస్టీ సెల్ అధ్యక్షులు గుజ్జల శివయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సహకార వారోత్సవాలు జూన్ 29 నుంచి జులై 6 వరకు

- సహకార శాఖ సీనియర్ ఇన్స్‌పెక్టర్ మహబూబ్ దౌలా



వ్యాసరచన పోటీలను నిర్వహిస్తున్న దృశ్యం

శింగనమల, జులై 4 ప్రభాతవార్త

సహకార సంఘాల కమిషనర్, రిజిస్ట్రర్ వారి ఆదేశాల మేరకు సహకార్ సే సంవృద్దిలో భాగంగా సహకార వారోత్స వాలు జూన్ 29 నుంచి జులై 6వ తేది వరకు నిర్వహిస్తున్నట్లు సహకార శాఖ సీనియర్ ఇన్స్ పెక్టర్ మహబూబ్ దౌలా తెలిపారు. శనివారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేస్తూ భారత ప్రభుత్వం సహకార శాఖను ఏర్పాటు చేసి ఐదు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఆంధ్ర ప్రదేశ్ కోఆపరేటివ్ యూనియన్ వారి సారధ్యంలో సహకార వారోత్స వాలు నిర్వహిస్తున్నట్లు అందులో భాగంగా శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కెజిబివి, వెస్ట్ నర్సా పురం ఉన్నత పాఠశాల సోదనపల్లి జిల్లాపరిషత్ హై స్కూల్, జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులకు సుమారు 34 మందికి పేదరిక నిర్మూలనలో సహకార సంఘాల పాత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి ఆగస్టు 15వ తేదిన జిల్లా కలెక్టర్ చేతులు మీదుగా అవార్డు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శివ ప్రసాద్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం చంద్రకళ, పాఠశాల సిబ్బంది అనీఫ్, నాగరాజు, సూర్యనారాయణరెడ్డి, కెజిబివి ఎస్ఓ గీతారాణి, శింగనమల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సిఇఓ నారాయణస్వామి, సిబ్బంది రసూల్ సాహెబ్, కుల్లాయిస్వామి, మసూద్‌వలి తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎస్ఐఆర్ పై ప్రత్యేక డ్రైవ్

జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్..

అనంతపురం కలెక్టరేట్ జూలై 04 ప్రభాతవార్త



ఎస్ఐఆర్ పై నేడు అనగా శనివారం, 05వ తేదీ ఆదివారం సర్ పై ప్రత్యేక డ్రైవ్ చేపట్టడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని వేగవంతం చేయడానికి, తక్కువ పురోగతి ఉన్న ప్రాంతాల్లో ఫోకస్డ్‌గా చేయడానికి ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, పూరించడంలో వారికి సహకారం అందించి, పూరించిన వాటిని కలెక్షన్ ద్వారా బిఎల్ఓకి అందేలా మరియు డిజిటైజేషన్ చర్యలు కొరకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేహాల మేరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఉన్న అధికారులు, వారి సిబ్బంది, సుమారు పదివేల మంది ఉపాధ్యాయులు ఇందులో పాల్గొనేలా చర్యలు తీసుకోవడం జరిగిందని, ఇందుకు సంబంధించి ఆదేశాలు జారీ చేశామన్నారు. డిఆర్డిఏ, మెప్మా సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, ఆయా శాఖల సిబ్బంది ఇందులో పాల్గొంటారన్నారు. బూత్ స్థాయి అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి, ప్రతి ఒక్కరూ కనీసం 30కి పైగా ఓటర్ల నుంచి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేయడం, ఫారాలను పూరించేందుకు అవగాహన కల్పించి సహకరించడం, పూరించిన వాటిని తప్పనిసరిగా బిఎల్ఓకి అందేలా, డిజిటైజేషన్ చర్యలు తీసుకోవాలని అన్నారు. జాయింట్ కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి వారిని కూడా సర్ కార్యక్రమంలో విస్తృతంగా భాగస్వాములు చేసి పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. నిర్లక్ష్యం వహించే అధికారులు బిఎల్వోలపై చర్యలు తప్పక ఉంటాయని తెలిపారు.

## పెంపుడు కుక్కలకు వీధి కుక్కలకు ఉచిత టీకాలు

బుక్కరాయసముద్రం జూలై 4 ప్రభాతవార్త



ఏ.వి రత్నకుమార్

ఈ నెల 6తేదిన జూనోసిస్ దినోత్సవం సందర్భంగ బుక్కరాయసముద్రం, నార్పల మండలాల్లో పెంపు కుక్కలకు వీధి కుక్కలకు రేబిస్ వ్యాధి నివారణ టీకాలు ఉచితంగా వేస్తున్నట్లు డాక్టర్ ఏ.వి.రత్నకుమార్ నేడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగ ఆయన మాట్లడుతూ జూనోసిస్ వ్యాధులు అనగా పశువుల నుండి మనుషులకు అలాగే మనషులనుండి పశువులకు సోకే వ్యాధులను జోనోసిస్ వ్యాధులు అంటారు. వీటిలో ముఖ్యమైనవి రేబిస్, జపనీస్ ఎంసెఫలైటిస్, ఆంత్రాక్స్ లెఫ్టోస్ వైరస్ మొదలగు వ్యాధులు ఉన్నాయి, ఇటువంటి వ్యాధుల గురించి అవగాహన కల్పించుటకు పశువైద్యశాల్లో అన్ని కుక్కలకు ఉచితంగా టీకాలు వేయడం జరుగును. కుక్కకాటుకు గురి అయిన మనుషులకు, పశువులకు కుక్క కొరికిన వెంటనే తీసుకోవాల్సిన జాగ్రతలు గురించి అవగాహన కల్పించబడును.

## ఓటరు వెరిఫికేషన్‌ను పరిశీలించిన సర్ పరిశీలకులు డేగల కృష్ణమూర్తి



సర్ ప్రక్రియను పరిశీలిస్తున్న డేగల కృష్ణ మూర్తి

శింగనమల, జులై 4 ప్రభాతవార్త

మండల పరిధిలోని గుమ్మేపల్లి గ్రామ పంచాయితీలో 53 బూత్‌లో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదేశాల మేరకు నియోజకవర్గం సర్ పరిశీలకులు డేగల కృష్ణమూర్తి ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఓ లీలావతి, బిఎల్ఏ మల్లికార్జున, విఆర్ఏ నల్లప్ప, డేగల హరి తదితరులు పాల్గొన్నారు.

## మహనీయులకు ఘననివాళి



చీరలు పంపిణీ చేస్తున్న విఆర్ రామిరెడ్డి

తాడిపత్రిఅర్బన్, జూలై 4 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణంలోని వైఎస్ఆర్‌సిపి తాడిపత్రి నియోజకవర్గం మాజీ సమన్వయకర్త విఆర్ రామిరెడ్డి కార్యాలయంలో శనివారం మన్యంవీరుడు అల్లూరి సీతారామారాజు, గుర్జాలిలాల్ నందాల జయంతితో పాటు స్వామివివేకానంద, పింగళి వెంకయ్యల వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చి త్రపటాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం నిరాదరణకు గురైన వితంతువులు, భర్త లేని మహిళలకు ఉచితంగా చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విఆర్ రామిరెడ్డి మాట్లాడుతూ స్వామి వివేకానంద యువతకు స్ఫూర్తి ప్రదాత అని ఆయన జీవించింది 39 సంవత్సరాలు అయినా ఆయన ఆధ్యాత్మిక సందేశం మాత్రం యావత్తు ఆధునిక ప్రపంచ గమనాన్నే మార్చి వేసిందనడంలో ఏమాత్రం సందేహం లేదన్నారు. లేవండి, మేల్కొనండి, లక్ష్యాన్ని సాధించే వరకు ఆగకండి అనే నినాదం నేటికి యువతకు దిశ, నిర్దేశంగా నిలిచిందన్నారు. అలాగే విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు 27 ఏళ్ల వయసులోనే మాతృభూమి విముక్తి కోసం బ్రిటీషర్లను గడగడలాడించి ప్రాణత్యాగం చేసిన స్వాతంత్ర సమరయోధుడని కొనియాడారు. అదేవిధంగా పింగళి వెంకయ్య భారత జాతీయ త్రివర్ణ పతాక రూపకర్తగా ప్రముఖ స్వాతంత్ర సమరయోధునిగా ఆయన పోరాట పటిమను కొనియాడారు. అలాగే గుర్జాలిలాల్ నందా రెండుసార్లు భారతదేశానికి తాత్కాలిక ప్రధానమంత్రిగా పనిచేశారని ఆయనకు సొంత ఇల్లు లేని నిరాడంబరమైన జీవితాన్ని గడిపారని, ఆయనకు 1997లో భారతరత్న అవార్డు లభించిందన్నారు. ఇటువంటి మహనీయులను స్మరించుకోవడం గర్వకారణంగా వుందని ఆయన పేర్కొన్నారు.

## అత్యంత భక్తిశ్రద్ధలతో ఏడు శనివారాల వ్రతం

- పెద్దఎత్తున పాల్గొన్న మహిళలు

తాడిపత్రిఅర్బన్, జూలై 4 ప్రభాతవార్త



వ్రతంలో పాల్గొన్న మహిళలు

తాడిపత్రి పట్టణంలోని పురాతన శ్రీచింతల వేంకట రమణస్వామి దేవస్థానంలో అత్యంత భక్తిశ్రద్ధలతో ఏడు శనివారాల వ్రతం నిర్వహించారు. ముందుగా శ్రీచింతల వేంకటరమణస్వామి, శ్రీఆనందవల్లి అమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ మండపంలో పెద్దఎత్తున మహిళలు ఏడు శనివారాల వ్రతం ఆచరించారు. 3వ శనివారం వ్రతాన్ని విజయవంతంగా పూర్తి చేసినట్లు ఆలయ ప్రధాన అర్చకులు మురళీఅయ్యంగార్ తెలిపారు.

## సర్ డిజిటలైజేషన్‌లో అలసత్వం ప్రదర్శించ వద్దు

- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి



సమావేశంలో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి

శింగనమల, జులై 4 ప్రభాతవార్త

ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ (సర్)ను గడువులోగాపూర్తి చేయాలని క్షేత్రస్థాయి విధుల్లో ఎలాంటి అలసత్వం ప్రదర్శించ వద్దని అన్ని పార్టీల ప్రతినిధులు సహకరించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని తహశీల్దారు కార్యాలయంలో వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో బిఎల్ఓలు తమ పనితీరును మెరుగు పర్చుకుని ఓటర్ల జాబితా సవరణలో ఎటువంటి లోపాలు, అవకతవకలు లేకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా వైసిపి సమన్వయ కర్త, మాజీ మంత్రి డా.సాకే శైలజానాథ్ మాట్లాడుతూ. ఓటర్లకు పంపిణీ చేసిన ఎన్యుమరేషన్ ఫారాలు, తర్వాత మిగిలిన వాటి వివరాలు తమకు అందజేయాలని, అందువల్ల వ్యక్తిగతంగా పార్టీ పరంగా వారు కుటుంబాల వద్దకు వెళ్లి వారి ఓటును కాపాడుకుంటామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు శేషారెడ్డి, టిడిపి మండల కన్వీనర్ గోరంట్ల మారుతినాయుడు, టిడిపి సర్ నియోజకవర్గ పరిశీలకులు డేగల కృష్ణమూర్తి, వైఎస్ఆర్‌సిపి రాష్ట్ర నాయకులు బొమ్మన శ్రీరామిరెడ్డి, తరిమెల వంశీగోకుల్‌రెడ్డి, బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి, ఎం.ఆదినారాయణ, ఆరు మండలాల తహశీల్దారులు, ఈడిటిలు పాల్గొన్నారు.

## పోలీస్‌స్టేషన్‌లో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

-ఫిర్యాదును పట్టించుకోలేదని ఆరోపణ



షేక్షావలితో చర్చిస్తున్న యల్లనూరు ఎస్ఐ రామాంజనేయరెడ్డి

పుట్లూరు, జూలై 4 ప్రభాతవార్త

పుట్లూరు పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పుట్లూరు మండల కేంద్రానికి చెందిన మిదుతూరు షేక్షావలి అనే వ్యక్తి పోలీస్‌స్టేషన్‌లోనే ఒంటిపై పెట్రోల్ పోసుకుని, తన కూతురిపై కూడా పెట్రోల్ పోసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అక్కడే ఉన్న పోలీసులు, స్థానికులు వెంటనే అప్రమత్తమై అతడిని అడ్డుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే షేక్షావలి తన భార్య రేష్మా ఇరువురి మధ్య కొన్ని కారణాల వలన మనస్పర్థలు ఏర్పడి పసి పిల్లలను భర్త వద్దే వదిలి పెట్టి తన పుట్టినింటిలో ఉంటోంది. కాగా శుక్రవారం రేష్మా తన తల్లిదండ్రులతో కలసి బ్యాంకు ఖాతా వివరాలు తెలుసుకోవడానికి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుకు రావడం జరిగింది. ఐతే ఇది గుర్తించిన షేక్షావలి భర్త, పిల్లలను వదిలిపెట్టి ప్రస్తుతం ఖాతాలో జమ అయ్యే డబ్బులు ముఖ్యమా అని వారిని నిలదీయడం జరిగింది. దీంతో ఇరువురి కుటుంబాల మధ్య వాగ్వావాదం చోటు చేసుకొంది. తనపై భార్య రేష్మా, వారి తల్లిదండ్రులు కుళ్లాయప్ప, బీబీ, పక్కీరయ్యలు దాడికి యత్నించినట్లు షేక్షావలి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తన భార్య రేష్మా తల్లిదండ్రులు మరియు వారి బంధువుల నుంచి తనకు ప్రాణహాని ఉందని పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురై ఈ చర్యకు పాల్పడినట్లు తెలిపాడు. ఈ ఘటనతో పోలీస్‌స్టేషన్‌లో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు షేక్షావలిని అదుపులోకి తీసుకుని పరిస్థితిని చక్కదిద్దారు. ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి వుంది.

## అల్లూరి సీతారమరాజును యువత ఆదర్శంగా తీసుకోవాలి

అనంతపురం సిటీ, జులై 4 ప్రభాతవార్త

స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజును యువత ఆదర్శంగా తీసుకుని దైవ భక్తి, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని జెఎన్‌టియుఏ విసి సుదర్శన్‌రావు సూచించారు. అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను పురస్కరించుకుని జెఎన్‌టియుఏ కార్యాలయంలో జెఎన్‌టియుఏ విసి సుదర్శన్‌రావు, రిజిస్ట్రర్ కృష్ణయ్యతో కలిసి అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన్యం ప్రజల కష్టాలను కడతేర్చ డానికి తెల్లదొరల దోపిడీని ఎదుర్కొనడానికి గిరిజనులకు అండగా అల్లూరి సీతారామరాజు నిలిచి పోరాడాలరని గుర్తు చేశారు. స్వాతంత్ర్య పోరాటంలో ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో యూనివర్సిటీ డైరెక్టర్లు, పలు విభాగాల హెచ్ఓడిలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రయాణాకులకు మెరుగైన సౌకర్యాలను కల్పించాలి

- బస్టాండ్ ఆకస్మిక తనిఖీలో జిల్లా కలెక్టర్

కదిరి, జులై 4 ప్రభాతవార్త

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఆర్టీసి బస్టాండ్‌ను ఆకస్మికంగా సందర్శించి, క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. బస్టాండ్ ఆవరణమంతా తిరుగుతూ ప్రయాణికులకు అందుతున్న సేవల, సౌకర్యాలను బస్టాండ్ నిర్వాహనను కలెక్టర్ స్వయంగా పరిశీలించి అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. బస్టాండ్ ఆవరణం, ఫ్లాట్‌ఫారాలు, నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని స్పష్టం చేశారు. ఎక్కడికక్కడ చెత్తా చెదారం లేకుండా పారిశుద్యాన్ని క్రమం తప్పకుండా కార్మికులు విధులు నిర్వహించేలా పర్యవేక్షించాలన్నారు. ప్రయాణికులకు వేసవి, సాధారణ రోజుల్లో ఇబ్బంది లేకుండా తాగునీటి సౌకర్యం అందుబాటులో ఉంచాలని, మరుగుదొడ్లను నిరంతరం శుభ్ర ంచేస్తూ నీటి సరఫరా సక్రమంగా ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. బస్టాండ్ ప్రాంతంలో పలువురు ప్రయాణికులతో మాట్లాడి బస్సులు సమయానికి వస్తున్నాయా, సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. దుకాణాలలో, క్యాంటీన్లలో వస్తువులను, పాణియాలను ఎమ్మార్పి ధర కంటే ఎక్కువ అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి దుకాణం వద్ద ధరల పట్టికను ప్రయాణికులకు కనిపించేలా ప్రదర్శించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అజయ్‌కుమార్, తహశీల్దారురెడ్డి శేఖర్, అధికారులు, ఆర్టీసి డిఎం తదితరులు పాల్గొన్నారు.

**CHANGE OF SURNAME**

I, UMMADI SREEDEVI (old name) W/o REDDEM MOHAN REDDY residing at 00 Kothapalli, Kurli, Talupula, Sri Sathya sai District 515581, A.P. Changing my name from UMMADI SREEDEVI (old name) to **REDDEM SREEDEVI** (new name). Hence forth, I am being **REDDEM SREEDEVI** for all transactions

**CHANGE OF NAME**
**(ADDED SURNAME)**

I, ASMA (old name) D/o. SHAIK RIZWAN BASHA, D.No.17-203, Buruju Street, Main Bazar, Dharmavaram - 515671, Sri Sathya Sai Dt. A.P.State, I have added Surname SHAIK to my existing name ASMA (old name) Hence forth, I shall be known as **SHAIK ASMA** (new name). for all transactions.

**CHANGE OF NAME**

I, Velpumadugu Sunanda Kumari W/o Velpumadugu Siva Reddy, aged 31 years, Hindu, residing at 3-20, Sangala Village, Dosaludiki Post, Guntakal Mandal, Anantapur Dist. SUNANDAKUMARI YANDAPALLI, Changing my name from **SUNANDAKUMARI YANDAPALLI** (Old Name) to **VELPUMADUGU SUNANDA KUMARI** (New Name) Hence forth, I shall be called as **VELPUMADUGU SUNANDA KUMARI** for all purposes

# ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత

**- రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ - పెద్ద కౌకుంట్లలో 3వ రోజు కొనసాగిన ప్రజా దర్బార్**


ప్రజలతో సమస్యలను తెలుసుకొంటున్న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

ఉరవకొండ, జూలై 4 ప్రభాతవార్త

అనంతపురం జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. ఉరవకొండ మండల పరిధిలోని తన స్వగ్రామమైన పెద్ద కౌకుంట్లలోని క్యాంపు కార్యాలయంలో వరుసగా 3వ రోజు మంత్రి ప్రజాదర్బార్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజల సమస్యలు తెలుసుకొని స్వయంగా అర్జీలు స్వీకరించారు. ప్రతి అర్జీదారుడితో స్వయంగా మాట్లాడిన మంత్రి సమస్యల స్వరూపాన్ని తెలుసుకొని సంబంధిత శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల సమస్యలు పరిష్కరించడంలో ఎలాంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందన్నారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు.


మంత్రి పయ్యావుల కేశవ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

# రాయలసీమ ప్రజల దశాబ్దాల కల ఉక్కు పరిశ్రమ - ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు

మడకశిర టౌన్ జూలై 4 ప్రభాతవార్త



ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు ఫైల్ ఫోటో..

రాయలసీమ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా యువతకు ఉపాధి కల్పించేలా కడప జిల్లా జమ్మలమడుగులో ఉక్కుపరిశ్రమను ఏర్పాటు శ్రీకారం చుట్టడం దశాబ్దాల కల అని ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు పేర్కొన్నారు. శనివారం సత్యసాయి జిల్లా అధ్యక్షులు, టిటిడి బోర్డు మెంబర్,ఎమ్మెల్యే రాజు. ఒకప్రకటనలోవిడుదల చేశారు రాయలసీమ ప్రజలకలను నెరవేర్చాలని రాయలసీమ స్టీల్ కార్పొరేషన్ను ఏర్పాటు చేసి, 2018 డిసెంబర్ 27న జమ్మలమడుగు సమీపంలోని కంబాలదిన్నె వద్ద తొలిసారి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. సుమారు రూ.18,000 కోట్ల పెట్టుబడితో, ఏడాదికి 3 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థంతో ఈ ఉక్కు కర్మాగారాన్ని నిర్మించి, ప్రత్యక్షంగా పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి కల్పించేలా సమగ్ర ప్రణాళికలు రూపొందించారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గండికోట జలాశయం మైలవరం డ్యాం నుండి 2 టీఎంసీల నీరు. రూ.40 కోట్లతో ఎన్ హెచ్ 67నుండి స్టీల్‌ప్లాంట్‌కు 12 కి.మీమేరా 4లైన్ల యాక్సెస్ రోడ్డు. ముద్దనూరు రైల్వే స్టేషన్ నుండి 12 కి.మీ మేరా రైల్వే లైన్ అనుసంధానంకు చర్యలుచేపట్టడం జరిగిందన్నారు 268 మెగావాట్ల విద్యుత్ డిస్ట్రిబ్యూషన్ సబ్ స్టేషన్, జమ్మలమడుగు సబ్ స్టేషన్ నుండి 400 కెవి (కె.వి) డబుల్ సర్క్యూట్ ట్రాన్స్ మిషన్ లైన్ల ఏర్పాటు. ప్రాజెక్టు కావాల్సిన అన్ని మౌలికసదుపాయాల అభివృద్ధి స్టీల్ ప్లాంట్కు అవసరమైన 1,100 ఎకరాలను ఎకరా రూ.5లక్షల చొప్పున, టౌన్షిప్స్ ఏర్పాటుకు 200 ఎకరాలను జమ్మలమడుగులోని సున్నపురాల్లపల్లెలో కేటాయింపు జరిగిందని పేర్కొన్నారు. అంతేకాకుండా మౌలిక వసతుల కల్పనకు బడ్జెట్లో రూ.25 కోట్లను కూటమి ప్రభుత్వం కేటాయించిందని అన్నారు.జె ఎస్ డబ్ల్య సంస్థతో కలిసి ఈ ప్రాజెక్టను పట్టాలకెక్కించేందుకు జులై 3న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పనులను పునఃప్రారంభించారన్నారు. మొదటి దశలో రూ.4,500 కోట్ల పెట్టుబడి పెడుతుండగా, రెండో దశలో రూ.11,850 కోట్ల పెట్టుబడి పెడుతున్నారు. రెండు దశలు పూర్తి అయితే 2 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి అవుతుంది అని పేర్కొన్నారు.ఈ కర్మాగారాన్ని 2028 నాటికి పూర్తి చేసి రాయలసీమ ఉద్యోగాల కల్పించనున్నాం అని పేర్కొన్నారు పర్యావరణానికి అనుకూలంగా కడప ఉక్కు పరిశ్రమలో ఉక్కు ఉత్పత్తి కానుందన్నారు. ఈ ప్లాంట్ సంప్రదాయ బొగ్గు ఆధారిత బ్లాస్ట్ ఫర్నేస్ విధానాన్ని కాకుండా స్క్రాప్ ఆధారిత ఎలక్ట్రిక్ ఆర్క్ ఫర్నేస్ సాంకేతికతను ఉపయోగించనుందని. దీనికి రెన్యువబుల్ ఎనర్జీని వాడటాన్ని స్వాగతిస్తున్నాను అని తెలిపారు. పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల కోసం మరో 2,000 ఎకరాలను జెఎస్డబ్ల్యు రిన్యూ ఎనర్జీ పేరుతో ప్రభుత్వం కేటాయించిందన్నారు దక్షిణ భారతదేశంలో తక్కువ కార్బన్ ఉద్గారాలతో శ్రీగ్రీన్ స్టీల్‌శ్రీ ఉత్పత్తి చేసే కేంద్రంగా ఈ ఉక్కు కర్మాగారం నిలవనుందిఅని పేర్కొన్నారు..తద్వారా ఆర్థికంగా ప్రభావం చూపడమే కాకుండా అనుబంధ పరిశ్రమలు కూడా వస్తాయి అని పేర్కొన్నారు.జమ్ముల మడుగు ప్రాంతానికి గుండెకాయ లాంటి స్టీల్ ప్లాంట్ మూడు సంవత్సరాలలో పూర్తి చేసి 75 ఉద్యోగాలు స్థానికులకు ఇస్తానని చెప్పిన జగన్మోహన్ రెడ్డి మడమ తిప్పారన్నార ఏపీ హై గ్రేడ్ కార్పొరేషన్ పేరిట 2019 డిసెంబర్ 23న మొదటిసారి శంకుస్థాపన చేసిన కంబాలదిన్నె వద్ద కాకుండా సున్నపురాళ్లపల్లె వద్ద మరోసారి శంకుస్థాపన చేసినా అంగుళం పనులు కూడా చేపట్టలేదు అన్నారు.ఓబులాపురం ఐరన్ ఓర్ గనులను కడప స్టీల్ ప్లాంట్ కు కేటాయించే అవకాశం ఉన్నప్పటికీ గాలి జనార్ధనరెడ్డికి కట్టబెట్టేందుకు సుప్రీంకోర్టులో నో అబ్జెక్షన్ పేరిట అఫిడవిట్లను దాఖలు చేశాడన్నారు చంద్రబాబు శంకుస్థాపన చేసిన వాటికి ఆయన శంకుస్థాపనలు చేసే ప్రజల్ని మభ్యపెడుతున్నాడని ఆరోపించారు.

# మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ రామసుబ్బారెడ్డి కి అస్వస్థత

**- బీపీ ఎక్కువ కావడంతో మెదడులో నరం చిట్లింది - జిల్లా కేంద్రంలోని సూర్య ఆసుపత్రిలో చికిత్స**

**- పరామర్శించిన జిల్లా రెవెన్యూ అధికారి, ఉద్యోగులు, టీచర్లు - ఇందుకు అధిక పని ఒత్తిడి కూడా ఒక కారణం**


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, జూలై 4 ప్రభాతవార్త

ఉమ్మడి అనంతపురంజిల్లా మైనార్టీవెల్ఫేర్ అసిస్టెంట్ డైరెక్టర్ జి. రామసుబ్బారెడ్డికు శుక్రవారం రాత్రి దాదాపు 7:30గంటల సమయంలో ఇంట్లో బీపీఎక్కువ కావడంతో వెంటనే కుటుంబసభ్యులు నగరంలో జీసెస్‌నగర్‌లో ఉన్న సూర్యఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్య పరీక్షలుచేయగా... మెదడులో నరంచిట్లిందని గుర్తించారు. ఐసీయూలో అడ్మిషన్ చేసుకొని చికిత్స అందిస్తున్నారు. ఆయన ఆస్పత్రిలో చేరిన సమయంలో ఏ విధంగా మాట్లాడాలేని పరిస్థితిలో ఉన్నారు. చికిత్స పొందుతున్న తరుణంలో శనివారం ఉదయం బాగా మాట్లాడినారు. అలా సాయంత్రానికి బాగా మాట్లాడుతూ అందర్నీ పలకరిస్తూ ఉన్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం బాగా ఉంది. మూడు రోజులు డాక్టర్ల పర్యవేక్షణలో ఉండిన తర్వాత మరొకసారి అన్ని వైద్య పరీక్షలు చేసి తదుపరి చికిత్స అందించనున్నట్లు వైద్యులు కుటుంబ సభ్యులకు తెలియజేశారు. ఈ విషయాన్ని ముందుగానే మైనార్టీ వెల్ఫేర్ ఉద్యోగులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న మైనార్టీ వెల్ఫేర్ ఉద్యోగులు, పలువురు టీచర్లు, బీసీ కార్పొరేషన్ ఉద్యోగులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వెల్ఫేర్ అధికారులు, పలువురు జిల్లా అధికారులు, పలువురు పాత్రికేయులు శనివారం ఆసుపత్రికి వచ్చి ఆయన్ను పరామర్శించారు. అలాగే జిల్లా రెవెన్యూ అధికారి మలోల కూడా ఆసుపత్రికి వచ్చి పరామర్శించారు. ఆయన త్వరగా కోలుకోవాలని ప్రతి ఒక్కరు ఆకాంక్షిస్తున్నారు.

**అధిక పని ఒత్తిడి కూడా ఒక కారణం :** ఉమ్మడి అనంతపురం జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అసిస్టెంట్ డైరెక్టర్ జి.రామసుబ్బారెడ్డి గతంలో టీచర్ గా పనిచేస్తూ కొన్ని సంవత్సరాల తర్వాత వయోజన విద్యాశాఖకు మారారు. అక్కడ కొంతకాలం అసిస్టెంట్‌ప్రోగ్రామ్‌ఆఫీసర్‌గా పనిచేశారు. కొంతకాలం తర్వాత మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసుకు మారి అనంతపురం జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా దాదాపురెండేళ్లుగా కొనసాగుతున్నారు. ఆయన ఇటు అనంతపురంలో, అటుశ్రీసత్యసాయి జిల్లాలో జరిగే సమావేశాలకు, కార్యక్రమాలకు హాజరు కావలసి ఉంది. అయితే జిల్లాకార్యాలయంలో పలుపోస్టులు కొన్ని ఏళ్లుగా ఖాళీగా ఉండడంతో ఆ పోస్టులు భర్తీ కాకపోవడంతో ఆ ఉద్యోగుల పనులను కూడా ఆయనే చేయాల్సి ఉంది. అలా పని ఒత్తిడి ఉన్నప్పటికీ దాదాపు రెండేళ్లుగా ఇలాంటి వివాదాలు లేకుండా ప్రశాంతంగా శాఖను ముందుకు తీసుకెళుతున్నారు. అందులో భాగంగానే ఆయనకు బీపీ ఎక్కువ కావడంతో మెదడులో నరం చిట్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

# రాయలసీమ కరువు నేలపై కార్లు పరిగెత్తించిన ఘనత సీఎం చంద్రబాబుది

**రాయలసీమ గురించి మాట్లాడే వాక్కు వైయస్సార్ సీపీకి లేదు**

**హిందూపురం పార్లమెంట్ సభ్యులు బి.కే పార్థసారథి**


విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ బీకే పార్థసారథి

పెనుకొండ జులై 04 ప్రభాతవార్త

రాయలసీమ కరువు నేలపై కియాకార్లు పరిగెత్తించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కి దక్కుతుందని, రాయలసీమ గురించి మాట్లాడే వాక్కు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కి లేదని హిందూపురం ఎంపీ బీ.కే పార్థసారథి తెలిపారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2019 నుంచి 2024 వరకు ఐదు సంవత్సరాలు అధికారంలో ఉండి హంద్రీనీవా ప్రాజెక్టుకు ఒక్క రూపాయి కూడా విదల్చకుండా ఈరోజు రాయలసీమ గురించి మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఆయన తెలిపారు.గొల్లపల్లి రిజర్వాయర్, చెర్లోపల్లి రిజర్వాయర్ ను నింపి కుప్పం నుంచి మాల్యల వరకు హంద్రీనీవా ద్వారా ఎన్నో చెరువులకు నీళ్లు నింపిన ఘనత తెలుగుదేశం పార్టీది అని ఆ ఘనత చంద్రబాబు నాయుడుకు దక్కుతుందని తెలిపారు. 2014లో రాయలసీమకు కియాపరిశ్రమ తెచ్చి కరువు నేలపై కార్లు పరిగెత్తించిన ఘనత కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి దక్కుతుందని తెలిపారు. పుట్టపర్తిలో యుద్ధ విమానాల తయారీ కేంద్రం మరియు తిరుపతిలో రాయల్ ఎన్ఫీల్డ్ కంపెనీ తీసుకొచ్చి రాయలసీమను పారిశ్రామిక కారిడార్ గా మార్చిన ఘనత మా తెలుగుదేశం ప్రభుత్వం కే దక్కుతుందని తెలిపారు. 2019 నుండి 2024 వరకు ఐదు సంవత్సరాల అధికారంలో ఉండి కూడా సొంత నియోజకవర్గానికి నీళ్లు తెచ్చుకోలేని ఘనత మీ నాయకుడిదని అయితే పులివెందులకు కూడా నీళ్లు తెచ్చిన ఘనత మా నాయకుడు చంద్రబాబు నాయుడుకు దక్కుతుందని తెలిపారు.

# ఎస్ఐఆర్ ను వేగంగా చేపట్టాలి జిల్లా కలెక్టర్ ఆనంద్

బుక్కరాయసముద్రం జూలై 4 ప్రభాతవార్త


బిఎల్ఓలతో మాట్లడుతున్న జిల్లా కలెక్టర్ ఆనంద్

ఎస్ఐఆర్‌ను వేగంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. శనివారం బుక్కరాయసముద్రం పంచాయితీ పరిదిలోని అనంతసాగర్ కాలని,విజయనగర్ కాలనిలో ఉన్న 144,149 పరిదిలో ఎస్ఐఆర్‌ను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీచేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లడుతూ ఎస్ఐఆర్‌ను త్వరితగతిన చేపట్టాలన్నారు. బిఎల్ఓలకు సహకారం అందించేందుకు డిఆర్డిఏ,పశుసంవర్ధక శాఖ,సెరికల్చర్,తదితర సిబ్బందిని అటాచ్ చేయాలన్నారు. సమయంతక్కువగా ఉన్నందున వేగంగా ఎస్ఆర్‌ను పూర్తిచేయాలన్నారు.ఎంపీడివోతో మాట్లడి ఆదివారం నుంచి అదనంగా బిఎల్ఓలకు సిబ్బందిని అటాచ్ చేయించాలని అవసరమైతే ఎన్జీవోలతో మాట్లడి టైఅప్ చేయించాలన్నారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సుయాశ్‌కుమార్,తహాశీల్దార్ శ్రీధర్‌మూర్తి, బిఎల్ఓలు అభిషేక్,సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# అన్నా క్యాంటీన్‌లో భోజన నాణ్యతను పక్కాగా పాటించాలి

**- అన్నా క్యాంటీన్ ఆకస్మిక తనిఖీలో జిల్లా కలెక్టర్**


అన్నా క్యాంటీన్‌లో భోజన నాణ్యతను పరిశీలిస్తున్న కలెక్టర్

కదిరి, జులై 4 ప్రభాతవార్త

పట్టణంలోని కాలేజీ సర్కిల్ సమీపంలో ఉన్న అన్నా క్యాంటీన్‌ను జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యాంటీన్‌లో పేదలకు అందుతున్న అల్పాహారం, భోజన వసతులు, మౌలిక సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. స్వయంగా జిల్లా కలెక్టర్ ఆహార పదార్థాలను పరిశీలించి నాణ్యతను పరిశీలించారు. అనంతరం క్యాంటీన్‌కు వచ్చిన లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడి భోజన నాణ్యతపై ఆరాతీశారు. సకాలంలో అందుతుందా అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పేదల ఆకలి తీర్చడం కోసం అన్నా క్యాంటీన్లను ప్రారంబించిందని, ఇందులో ఎలాంటి అలసత్వాన్ని ప్రదర్శించినా సహించేది లేదని స్పష్టం చేశారు. క్యాంటీన్‌లోపల వంటగతి పరిసర ప్రాంతాలు పరిశుభ్రత కచ్చితంగా పాటించాలని, ఈ విషయంలో మున్సిపల్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. మేనూ ప్రకారం అన్ని వంటకాలు రుచికరంగా, నాణ్యతగా అందించాలని క్యాంటీన్ నిర్వాహకులకు సూచించారు. క్యాంటీన్ వద్ద ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అజయ్‌కుమార్, తహాశీల్దారు రెడ్డి శేఖర్ అధికారులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ స్కూళ్లకు ధీటుగా గురుకులాల అభివృద్ధి

**- విద్యా రంగానికి కూటమి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత**

**- రూ.1.51 కోట్లతో నిర్మించిన కస్తూరిబా నూతన భవనాలను ప్రారంభించిన మంత్రి సవిత**


రిబ్బన్ కత్తిరిస్తున్న మంత్రి సవిత ,



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి

గోరంట్ల, జూలై 4 ప్రభాతవార్త

గోరంట్ల మండలం ఖాజాపురంలో దాదాపు 1.51 కోట్లతో నిర్మించిన కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కెజిబివి) మరియు జూనియర్ కళాశాల స్టార్ డార్మిటరీ, అదనపు తరగతి గదుల భవనాలను రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినులకు అన్ని వసతులతో కూడిన నాణ్యమైన విద్యను అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకుని తల్లిదండ్రులకు, పాఠశాలలకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొంటూ, కెజిబివిలు, గురుకులాలను ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. విద్యార్థుల భద్రత కోసం సీసీ కెమెరాలు, నిరంతర విద్యుత్ కోసం ఇన్వర్టర్లు, నాణ్యమైన సన్నబియ్యంతో కూడిన భోజనం వంటి సౌకర్యాలను కల్పించామన్నారు. అలాగే ప్రతి విద్యార్థికి సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో స్కూల్ కిట్లను అందజేస్తున్నామని, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోందని మంత్రి సవిత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి, హస్తకళల స్టేట్ డైరెక్టర్ సోమశేఖర్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి నరేష్, నిమ్మల శ్రీధర్, సింగిల్ విండో అధ్యక్షులు బెల్లాలచెరువు చంద్ర, రవిమోహన్, ఉమాశంకర్, బిజెపి మండల అధ్యక్షులు లక్ష్మినారాయణ, జిల్లా నాయకులు బొట్టు శ్రీనివాసులు, జనసేన మండల అధ్యక్షులు సంతోష్, జిల్లా కార్యదర్శి సురేష్, మాజీ ఎంపిపి నిమ్మల విద్యాధరణి, ఉత్తమరెడ్డి, నాగేనాయక్, గిరిధర్‌గౌడ్, అజంతుల్లా, బూదిలి లక్ష్మీపతి, వాల్మీకి వెంకటేష్, జయరాం, చింతా రామచంద్రరెడ్డి, నబిరసూల్, ఆగిశం నాగరాజు, రోహిత్, సుభహన్, పసుపులేటి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

# కడప ఉక్కు పరిశ్రమపై మోడీ ప్రభుత్వం దగా..!

**- ప్రయివేటు రంగంలో "మినీ స్టీల్ ప్లాంట్"..!**

అనంతపురం, జులై 4 ప్రభాతవార్త బ్యూరో


నీటిపారుదల నిపుణులు టి.లక్ష్మినారాయణ

కడప ఉక్కు పరిశ్రమపై మోడీ ప్రభుత్వం దగా..! ప్రయివేటు రంగంలో "మినీ స్టీల్ ప్లాంట్" ! అని నీటిపారుదల నిపుణులు టి.లక్ష్మినారాయణ ఒక ప్రకటనలో తెలియజేశారు. జే.ఎస్.డబ్ల్యూ రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జూలై 3న ప్రారంభించారు. రూ.16,350 కోట్ల పెట్టుబడితో, రెండు దశల్లో, ఏడాదికి 20 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో నెలకొల్పుతున్న ఈ పరిశ్రమ ద్వారా 2,500 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు. స్టీల్ ప్లాంట్‌కు అనుబంధంగా 3,850 మెగావాట్ల ఉత్పత్తి సామర్థంతో నియో ఎనర్జీ సోలార్ క్యాప్టివ్ పవర్ ప్రాజెక్టు నిర్మాణ పనులను కూడా ప్రారంభించారు. ఈ నిర్మాణ పనులు వేగంగా ముందుకు సాగితే శుభపరిణామంగా పరిగణించవచ్చు! అయితే, ప్రయివేటు రంగంలో నిర్మించ తలపెట్టిన ఈ స్టీల్ ప్లాంట్, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014, షెడ్యూలు 13, మౌలిక సదుపాయాల పద్దు కింద ప్రస్తావించిన భారీ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్"కు ఏ మాత్రం పొంతన లేదు. కడప ఉక్కు పరిశ్రమ అంశంపై మోడీ ప్రభుత్వం దగా చేసిందన్న వాస్తవాన్ని ప్రస్తుత ముఖ్యమంత్రి మరియు మాజీ ముఖ్యమంత్రి గుర్తుంచుకోవాలి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో శాసన వ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని దెబ్బతీసేలా ప్రభుత్వాలు వ్యవహరించకూడదు. 2014 ఎన్నికల ప్రచారంలో, "తల్లిని చంపి బిడ్డను వీధిలో పడేశారు" అని అంటూ, ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆవేదనను అర్థం చేసుకున్న వ్యక్తిలా మోదీ మాట్లాడారన్నారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పన్నెండేళ్లకు పైగా గడిచింది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని పలు అంశాలను ఒకదాని తర్వాత ఒకటి పాతరేసింది. వాటిలో కడప ఉక్కు పరిశ్రమ ఒకటి. "స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా(సెయిల్)" ఆధ్వర్యంలో నిర్మిస్తామని కేంద్ర ప్రభుత్వం చట్టంలో వాగ్దానం చేసింది. "సెయిల్" తన ఫిజిబిలిటీ రిపోర్ట్ లో లాభదాయకంకాదని పేర్కొన్నదని చెప్పి మోడీ ప్రభుత్వం ప్రజలను వంచించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలోనే గాలి జనార్దన్ రెడ్డికి చెందిన ఓబులాపురం మైనింగ్ కంపెనీ బ్రహ్మణి స్టీల్స్‌ను ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చిందన్న విషయం గమనార్హం. భారీ అవినీతికి పాల్పడినందుకు గాలి జనార్దన్ రెడ్డి జైలుకు వెళ్లడంతో ఆ వ్యవహారం ముగిసిపోయింది. ప్రభుత్వం ఆ కంపెనీకి కేటాయించిన సుమారు 12,000 ఎకరాల భూమి ఇప్పుడు న్యాయపరమైన వివాదంలో చిక్కుకుంది. నేడు జే.ఎస్.డబ్ల్యూ సంస్థ లాభదాయకత లేకపోయినా రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి పూనుకుందా..! అంటే, ప్రయివేటు రంగంలో ఉక్కు పరిశ్రమను నెలకొల్పడానికి లాభదాయకత ఉంటుంది. కానీ, ప్రభుత్వ రంగంలో నెలకొల్పడానికి మాత్రం ఉండదు. ఇదేనా, కేంద్ర ప్రభుత్వ ఆర్థిక నీతి మరియు ప్రజాస్వామ్య నీతి..? బ్రాహ్మణీ స్టీల్స్ కు డా.వై.ఎస్.రాజశేఖరరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో ప్రభుత్వ ప్రయివేటు భాగస్వామ్యం (పిపిపి) పథకం క్రింద ఏర్పాటు చేస్తామంటూ ఒక సంస్థను ఏర్పాటు చేసి నారా చంద్రబాబునాయుడు మరియు జే.ఎస్.డబ్ల్యూ (జిందాల్) పరిశ్రమ నిర్మాణానికి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి రెండు సార్లు, ఇలా శంకుస్థాపనల పరంపర తర్వాత ఇప్పుడు జే.ఎస్.డబ్ల్యూ పరిశ్రమ నిర్మాణ పనులను చంద్రబాబునాయుడు తాజాగా ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వాన్ని నిగ్గదీసి హక్కుగా సాధించుకోవాల్సిన కడప ఉక్కు పరిశ్రమను మరచిపొమ్మని, నాటి, నేటి పాలకులు కరవు కాటకాల మధ్య కునారిల్లిపోతున్న, పారిశ్రామికంగా వెనుకబడ్డ రాయలసీమ ప్రజలకు చావు కబురు చల్లగా చెప్పేశారు. అనంతపురం జిల్లా ఓబుళాపురం మరియు పొరుగునున్న కర్ణాటక రాష్ట్రంలోని బళ్ళారి ప్రాంతంలోను, రాయలసీమ ప్రాంతంలోని ఇతర జిల్లాలు, ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఉక్కు పరిశ్రమకు కావలసిన ముడి ఖనిజం నిక్షేపాలు పుష్కలంగా ఉన్నాయని నిపుణులు మరియు ప్రభుత్వం కూడా చెబుతున్నది. ఈ ప్రాంతంలో లభించే ముడి ఇనుప ఖనిజాన్ని వినియోగ వస్తువుగా మార్చి, విలువను జోడించి, దేశీయంగా వాడుకోవడం లేదా విదేశాలకు ఎగుమతి చేయడం ద్వారా జాతీయ ఉత్పత్తిని పెంచేలా కేంద్ర ప్రభుత్వ రంగంలో భారీ ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేసే విజ్ఞతను పాలకులు ప్రదర్శించకపోవడం శోచనీయం.

# ప్రతి పంచాయతీకి..రూ.2 కోట్లు

**మొదటిపేజీ తరువాయి...** అంకితం చేస్తామన్నారు. ఇవే కాక మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. రెండేళ్ల కూటమి పాలనపైనా, 5 ఏళ్ల వైసీపీ పాలనపైనా చర్చకు సిద్ధమని మంత్రి సవిత సవాల్ విసిరారు. ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమం(సర్) పై ఎవరూ నిర్లక్ష్యం చూపొద్దని, బిఎల్ఓలు అడిగిన సమాచారం అందజేయాలని, లేకుంటే ఓట్లు గల్లంతయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. ప్రతి ఒక్క ఓటరు ఎన్నికల అధికారులను కలిసి తమ సమాచారం అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు కూటమి నాయకులు, కార్యకర్తలు, దేవాదాయ శాఖాధికారులు పాల్గొన్నారు.


ఓవర్ హెడ్ ట్యాంకును ప్రారంభిస్తున్న మంత్రి

**జగన్ రప్పా రప్పా క్రెడిట్ మాకొద్దు :**

అనంతరం తనను కలిసిన విలేకరులతో మంత్రి సవిత మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు సమర్థవంతమైన నాయకత్వంలో రైజింగ్ రాయలసీమ ఆవిర్భవిస్తోందని మంత్రి సవిత తెలిపారు. 16,350 కోట్లతో రాయలసీమ స్టీల్ ప్లాంట్ పరిశ్రమ ఏర్పాటవుతోందని, ఈ పరిశ్రమతో వేలాది మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభించనుందని తెలిపారు. ఇప్పటికే రాయలసీమను డ్రోన్ హబ్ గా, పారిశ్రామిక హబ్, టూరిజం హబ్ గా, హార్టికల్చర్ హబ్‌గా రూపొందించేలా తమ ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. యుద్ధ విమానాలు, రాయల్ ఇన్ ఫీల్డ్ ద్విచక్ర వాహనాల తయారీ పరిశ్రమలు ఏర్పాటయ్యా యన్నారు. రాయలసీమను అన్నివిధాలా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా సిఎం చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారన్నారు. స్టీల్ ప్లాంట్ ఏర్పాటు తమ ఘనతేనని జగన్ చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. 2018లోనే కడపలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు సిఎం చంద్రబాబునాయుడు భూమి పూజ చేశారన్నారు. జగన్ క్రెడిట్ అంతా రప్పా రప్పా నరకడం, విధ్వంసమేనన్నారు. తమ ప్రభుత్వానిది అభివృద్ధి క్రెడిట్ అన్నారు. జగన్ రప్పా రప్పా క్రెడిట్ తమకు అవసరం లేదన్నారు. అమరావతికి వ్యతిరేకంగా ఎన్నికలకు వెళతామన్న జగన్‌ను 2024 ఎన్నికల్లో ప్రజలు ఓడించి తగిన గుణపాఠం చెప్పారని మంత్రి సవిత ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి, హస్తకళల స్టేట్ డైరెక్టర్ సోమశేఖర్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి నరేష్, నిమ్మల శ్రీధర్, సింగిల్ విండో అధ్యక్షులు బెల్లాలచెరువు చంద్ర, రవిమోహన్, ఉమాశంకర్, బిజెపి మండల అధ్యక్షులు లక్ష్మినారాయణ, జిల్లా నాయకులు బొట్టు శ్రీనివాసులు, జనసేన మండల అధ్యక్షులు సంతోష్, జిల్లా కార్యదర్శి సురేష్, మాజీ ఎంపిపి నిమ్మల విద్యాధరణి, ఉత్తమరెడ్డి, నాగేనాయక్, గిరిధర్‌గౌడ్, అజంతుల్లా, బూదిలి లక్ష్మీపతి, వాల్మీకి వెంకటేష్, జయరాం, చింతా రామచంద్రరెడ్డి, నబిరసూల్, ఆగిశం నాగరాజు, రోహిత్, సుభహన్, పసుపులేటి శ్రీనివాసులు, గుంటిపల్లి ఈశ్వరయ్య, రంగనాథం, జిలాని, మెడికల్ స్టోర్ శ్రీనివాసులు, పాయల రమణ, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు లక్ష్య సాధనపై స్పష్టత కలిగి ఉండాలి

**మొదటిపేజీ తరువాయి...** ఇంటర్నెట్ సౌకర్యంతో పాటు ఐఎఫ్‌పి ప్యానెల్ ద్వారా లైవ్ క్లాసెస్ మరియు ప్రీరికార్డెడ్ క్లాసెస్ అందుబాటులో ఉంటాయి. అంతేకాకుండా విద్యార్థుల నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవడానికి వీలుగా ఎఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) బేస్డ్ అడాప్టివ్ మాక్ టెస్ట్‌ల సదుపాయాన్ని కూడా కల్పించాము. భారతదేశంలో ప్రతియువకుడికి స్వామి వివేకానంద ఒక రోల్ మోడల్. అందుకే ఆయన జన్మదినమైన జనవరి 12ను మనం`నేషనల్ యూత్ డ్డేగా జరుపుకుంటాము. జీవితంలో భయం వేసినా, ఓడిపోతున్నామనే భావనవచ్చినా వివేకానందుడిని స్మరిస్తే గుండెల్లో ధైర్యం పెరుగుతుంది. ఎన్ని అడ్డంకులు ఎదురైనా నిర్భయత్వంతో ముందడుగు వేయాలన్నదే ఆయన బోధన.ఈ స్టడీ సర్కిల్ ద్వారా కల్పించిన ఈ గొప్ప అవకాశాన్ని నిరుద్యోగ యువత, విద్యార్థులందరూ గరిష్టంగా ఉపయోగించుకుని తమ కెరీర్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ.విద్యార్థులకు, పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే అభ్యర్థులకు పలు కీలక సూచనలు చేశారు.పోటీ పరీక్షల్లో విజయం సాధించడానికి కేవలం కష్టపడడమే కాకుండా, సరైన ప్రణాళికతో కూడిన స్మార్ట్ వర్క్ అవసరమని పిలుపునిచ్చారు.గతంలో ఇలాంటి ఉచిత కోచింగ్, స్టడీ సెంటర్ల సౌకర్యాలు ఉండేవి కావని, ప్రస్తుతం ఏసీ, లైబ్రరీ, కంప్యూటర్ స్క్రీన్లు వంటి ఆధునిక వసతులతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని అభ్యర్థులు పూర్తిగా ఉపయోగించుకోవాలని కోరారు.విద్యార్థులు నిరంతరం ఈ స్టడీ సర్కిల్‌ను ఉపయోగిస్తూ ఉంటే, రాబోయే రోజుల్లో తాము, జిల్లా కలెక్టర్ స్వయంగా వచ్చి పరీక్షలకు ఎలా ప్రిపేర్ అవ్వాలనే అంశాలపై ఇంటరాక్షన్ క్లాసులు నిర్వహిస్తామని తెలిపారు. గాండ్లపెంట, ఎన్‌పీ కుంట, తనకల్లు వంటి పరిసర ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులకు ప్రభుత్వ ఉచిత బస్సు సౌకర్యం కూడా ఉందని, దీనిని సిన్సియర్ గా చదువుకునే ప్రతి ఒక్కరూ వాడుకోవాలని ఎస్పీ సూచించారు. ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థులు తమ జీవితంలో ఒక స్పష్టమైన అవగాహన, లక్ష్యంతో ముందుకు సాగాలని కదిరి శాసన సభ్యులు కందికుంట వెంకట ప్రసాద్ పిలుపునిచ్చారు. సివిల్ సర్వీసెస్ వంటి ఉన్నత లక్ష్యాల వైపు అడుగులు వేస్తున్న విద్యార్థుల్లోని ఆత్మవిశ్వాసాన్ని ఆయన అభినందించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఇంతటి అద్భుతమైన వేదికను, మధ్యాహ్న భోజన వసతిని కల్పించిన జిల్లా కలెక్టర్ చొరవను ఆయన మనస్ఫూర్తిగా శ్లాఘించారు. ఈ స్టడీ సర్కిల్ ఫలితాలను బట్టి, రాబోయే రోజుల్లో గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు సైతం లబ్ధి చేకూర్చేలా మండల స్థాయిలోనూ వీటిని ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నాఅని ఎమ్మెల్యే ప్రకటించారు. విద్యార్థులు చదువుపైనే ఏకాగ్రత ఉంచి, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కదిరి ఆర్డీఓ కలావతి, కదిరిమున్సిపల్ కమిషనర్, బిసి సంక్షేమ అధికారి రాజేంద్ర కుమార్ రెడ్డి, ఎస్సి సంక్షేమ అధికారి రెడ్డి బాలాజీ, డిఇఒ క్రిస్టప్ప, స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ హరికృష్ణ, కదిరి తహాశీల్దార్ రెడ్డి శేఖర్, విద్యార్థులు తధితరులు పాల్గొన్నారు.